ప్రజాశక్తి

Vol. 4, no. 2

(Jan. 12, 1944)

బెజవాడ, 1944

Prajāśakti

Vol. 4, no. 2

(Jan. 12, 1944)

Bejavāḍa, 1944

Record no. 683

0-2-0 Regd. No. M. 4486

ప్రజాశక్తి

భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక

సంపుటి 4 సంచిక 2	: సంపాదకవర్గం : మద్దుకూరి చంద్రశేఖరరావు (సం) కంభంపాటి సత్యనారాయణ	★	పుచ్చలపల్లి సుందరయ్య తుమ్మల వెంకటరామయ్య చలసాని వాసుదేవరావు	బుధవారం 12-1-44

ప్ర బో ధం

ఎండవానలలోన
బండచాకిరిజేసి
పండించి ధాన్యాన్ని
పంటకళ్ళములోన
మేటిరానిగజేసి మురిసిపోతుంటావు
ఆనాటి అనుభవం బెవ్వారిదోసీకు
యోచనేలేదాయె ఓ రైతా
అంతవెర్రిబాగులవాడవా రైతా ॥ఎ॥

పంటపండించుచే
పరికింప నీవంత ?
కొంతమూల్యాన్నిచ్చి
కొని సాహుకార్లంత
దొంగకొట్లల్లోన దాచి ఆ ధాన్యాన్ని
అపరిమితలాభాల కమ్ముచుండుటవల్ల
విషమించె స్థితిగతులు ఓ రైతా
దాని వివరమెరుగగజాలవా రైతా ॥ఎ॥

బియ్యమే దొరుకకను
బెంగాలులో నేడు
లక్షలాదిగ ప్రజలు
చచ్చిపోతున్నారు
మలబారు ప్రజలంత మాడిపోతున్నారు
ఆంధ్రులూ, ఓఢ్రులూ, అలమటిస్తున్నారు
ఎందుచేతనొ ఎరుగవా ? రైతా
దొంగలాభాల ఫలితమేగా రైతా ॥ఎ॥

ప్రజలందరికినేడు
పట్టెడన్నముబెట్టి
పోషించుకొనుటయే
స్వాతంత్ర్యమార్గంబు
ప్రజలేని స్వాతంత్ర్య మదిఏమిఫలమయ్యా
స్వాతంత్ర్యమెవ్వరికి? మనుషులకా? మట్టికా
అందుచే మనప్రజలకో రైతా
అన్నమిడి పోషించుమా రైతా ॥ఎ॥

నీకు కావలసినది
నిలువబెట్టుకువేగ
పై మిగులు ధాన్యాన్ని
ప్రజల కందించుటకు
స్వార్థపరులకు సరుకు దొరకకుండాజేసి
సరసమగుధరలకే సరుకులమ్మించుటకు
ఆహారకమిటీల నో రైతా
వేగమేర్పాటుచేయవయ్యా రైతా ॥ఎ॥

— ముక్కామల నాగభూషణం

పోటీసంఘాలు పెట్టడం రైతుఉద్యమానికి ద్రోహంచేయడమే !

కొట్రగడ్డ నారాయణరావు
యం. యల్. ఏ.,

కృష్ణాజిల్లా రైతుసంఘం 1935 లో ఏర్పడింది. యీ సంఘం రిజిస్టరు చేయబడింది. నాటినుండి కృష్ణాజిల్లా రైతాంగానికి యీ సంఘం సేవచేస్తూంది. నిత్యం రైతులను ఎదుర్కొనే అనేక యిబ్బందులను పరిష్కారం చేసింది. నజరానాలు రద్దుచేయించడం లోను, ఎక్కువభూమిని సాగులోనికి తెచ్చి అధిక పంటను పండించడంలోనూ విజయం పొందింది. ఈసేవ ఫలితంగానే కృష్ణాజిల్లా రైతుసంఘం క్రమేణా బలపడింది. అనేక వేలమందిని సమీకరించ కలిగింది. నేడు 35 వేలు సంఘ సభ్యులను కల్గివుంది.

ఇలాంటి రైతుసంఘాన్ని చీల్చడానికి నేడు కామినేని వెంకటప్పయ్య, పామిరెడ్డి సుబ్బారెడ్డి, గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, విడికిటి రామకోటయ్యగార్లు తీవ్రంగా ప్రయత్నించుతున్నారు. రైతు ఉద్యమానికి అరిష్టదాయకమైన యీ కార్యక్రమాన్ని ఎందుకు తలపెట్టారు ? అనే ప్రశ్నకు సమాధానం రైతాంగం తెలిసికోవాలి.

రెండు పోకడలు

కృష్ణాజిల్లాలో రైతుసంఘం ఏర్పడిన మొదటి రోజులలో యీ వ్యక్తులు దానిలో పనిచేశారు. పదవులుకూడ వహించారు. కాని క్రమేణా తమ స్వాంతపనులు చూసుకొంటూ రైతులలో పనిచేయడం మాని, నామకః మాత్రం అందులో వుంటూవచ్చారు. 1942 వ సంవత్సరంలో భారత రాజకీయాలలో అశాంతి ప్రబలింది. రైతుసంఘాలలో పనిజేసేవారిలో రెండుఅభిప్రాయాలు తీవ్రరూపం దాల్చాయి. (1) రైతుసంఘాలను ప్రభుత్వం మీదకు తిరుగుబాటు చేయించాలనీ, అరాచకోద్యమంలో పాల్గొనాలనేవారు ఒకముఠా, (2) రైతుసంఘాలు విధ్వంసక కార్యక్రమంలో పాల్గొనుట రైతులకు నష్టదాయకమేగాక దేశాన్ని అరాచకంలో ముంచిన వారమవుతాము, అది జపాను దండయాత్రకు సాయపడుతుంది, అందుచే పనికిరాదనేవారు రెండో ముఠా. మొదటిముఠాకు నాయకులు గోగినేని రంగనాయకులుగారు. ఈకార్యక్రమంతోఅఖిల భారతరైతుసంఘాన్ని స్వాధీనంచేసుకోవాలని ప్రయత్నించి విఫలులయ్యారు. స్వామిజీ, కమ్యూనిస్టులు కలసిరాలేదని కోపగించుకొని, తమపట్టుదలను నెగ్గించుకొనుటకు మరేమీ మార్గంలేక చీలికలుపెట్టుటకు పూనుకున్నారు. రాష్ట్రరైతుసంఘాన్ని రద్దుచేశామంటూ తమ చేతుల్లోవున్న వర్కింగ్ కమిటీచేత తీర్మానం ప్యాసుచేయించారు. ఇది ప్రజాస్వామ్యసూత్రాలకు విరుద్ధమైనదని వేరే చెప్పనక్కరలేదు.

ఈ తీర్మానాన్ని కృష్ణాజిల్లా రైతుసంఘం ఆక్షేపించింది. అలాగే గ్రామరైతుసంఘాలు, వర్కర్లు తమ ఆక్షేపణను అఖిలభారత రైతుసంఘానికి విన్నవించుకొన్నారు. అఖిలభారత రైతుసంఘం లోగడ రాష్ట్రరైతుసంఘ కార్యదర్శిగా పనిజేసిన చలసాని వాసుదేవరావు గారిని ఆర్గనైజరుగా నియమించి, ఆంధ్రదేశంలో రైతుసంఘాలకృషిని కొనసాగించుటకు ఏర్పాట్లు గావించింది. అన్నిజిల్లాలలోనూ రైతాంగము విరివిగా సభ్యులుగాచేరి, ముందెన్నడూలేనంత నిర్మాణశక్తిని సంపాదించుకొన్నది.

రైతుసంఘాలకు వ్యతిరేక ప్రచారం

ఈ కాలంలో రంగా అనుచరులు, వారి 'జమీన్‌రైతు' పత్రిక రైతుసంఘాలలో చేరవద్దని ప్రచారం చేశారు. వారిచే ఏజంటుగా నియమించబడిన పామిరెడ్డి సుబ్బారెడ్డి గారు బందరులో ఆఫీసుపెట్టి, రైతుసంఘాలలోచేరవద్దని 23-12-42 న కరపత్రాలువేసి పంచిపెట్టారు. దీనివల్ల పాపం ! వారి కేమీ ప్రయోజనం లేకపోగా, పూర్వం వున్న పేరు కూడ పోసాగింది. ఆ రోజులలో వారి కార్యక్రమం కాంగ్రెసు పేరుతో విధ్వంసకార్యక్రమాన్ని ప్రచారం చేయడమే. ఇంతలో గాంధీజీ జైలునుంచి విధ్వంసక చర్యలు కాంగ్రెసు కార్యక్రమం కాదని తన లేఖలలో స్పష్టపరచాడు. దీనితో రంగా అనుచరులకు పెద్ద దెబ్బ తగిలింది. పొరపాటుపడి వారికి మద్దతుయిచ్చిన దేశభక్తులు అంతటితో విరమించుకొన్నారు. రైతుసంఘంలో సభ్యులుగా చేరి రైతుసంఘాలను బలపరచుతున్నారు. నేడు కృష్ణాజిల్లాలో రైతుసంఘంలో 35 వేలకుపైగా సభ్యులు చేరారు.

కొత్తయెత్తు

తాము ప్రజలకు, దేశభక్తులకు దూరమవుతున్నామని తెలిసికొని రంగా అనుచరులు కొత్తఎత్తు ప్రారంభించారు. దీనిఫలితమే కృష్ణాజిల్లాలో పోటీ రైతుసంఘం. వీరు తమపొరపాటును గ్రహించి, విచ్ఛిన్న కార్యక్రమాన్ని మానుకొని, 35 వేల సభ్యత్వం గల రైతుసంఘంలో చేరి సేవచేస్తే బాగుండేది. కాని వారికి ఆమార్గం నచ్చలేదు. అలాచేస్తే తమతప్పును ఒప్పుకొన్నట్లు అవుతుందని భయపడి, ఈ విచ్ఛిన్నమార్గాన్ని తొక్కుతున్నారు.

కమ్యూనిస్టు వ్యతిరేకత

అందుకుగాను వారు అవలంబించే పద్ధతులు చాలా వక్రంగా వున్నాయి. అందులో ఒకపద్ధతి కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారం. ఈ ప్రచారాన్ని ప్రపంచంలో ఫాసిస్టులు బాగా ఉపయోగించుకొంటున్నారు. భారతదేశంలో తామెందుకు ఉపయోగించుకోగూడదని వీరనుకొంటున్నారు. కాని ఆరోజులు గతించిపోయాయనే విషయాన్ని వీరు మరచిపోతున్నారు. కమ్యూనిజం పేరుచెప్పి భయపెట్టి, ప్రపంచాన్నిజయించాలనుకొన్న హిట్లరు వెల్లకిల బడ్డాడు. జర్మనీరేడియో ఇంగ్లండు-అమెరికా భాగ్యవంతుల సాయంతో ఎల్లాగైనా ఓటమిని తప్పించుకోవాలని బోల్షివిజం యూరపులో ప్రవేశించకుండుటకే తాము యుద్ధంచేస్తున్నామని ప్రచారం చేస్తూంది. దీనిని ఎవరు నమ్ముతారు? చైనాలో కమ్యూనిజం వ్యాపించకుండాను, ఆశియాఖండంలో తెల్లజాతుల పరిపాలన పారదోలుటకు తాను యుద్ధం చేస్తున్నానని జపాన్ చేసే దుష్ప్రచారాన్ని చూచి ఎవరుమోసపోతారు? ఆవేషాలతో జర్మనీ-జపాన్‌లు ప్రవహింపజేసిన రక్తం, బలిగొన్న ప్రజల ప్రాణాలే నిజాన్ని ప్రపంచానికంతకూ వెల్లడిచేశాయి.

రంగాఅనుచరులకు విన్నపం

అలాగే నేడు రంగా అనుచరులు, వారి పత్రికలు ఆ పద్ధతులే అనుసరించుతున్నారంటే వారిని చూచి విచారించవలసివస్తుంది. గాంధీజీ అరెస్టుఅయిన తరువాత ప్రజలు రెండుపక్షాల కార్యక్రమాన్ని ఆచరణలో చూచారు; అనుభవించారు. రైతుసంఘం చేసిన అమూల్యసేవను ప్రజలు మరచిపోలేరు. ఇంతటితోనైనా రంగా అనుచరులు తమపంథా మార్చుకొనాలనీ పోటీసంఘాలు పెట్టి రైతువుద్యమంలో చీలికలుతెచ్చే ప్రయత్నాలు విరమించాలని నా విన్నపం. అలా చేయకపోతే రైతువుద్యమానికే ద్రోహం చేస్తున్నారన్నమాట.

ఈ రైతువుద్యమ ద్రోహులకు యెలా జవాబు చెప్పాలో రైతాంగప్రజలకు తెలుసు. ఇదివరకు యీ సుబ్బారెడ్డి వగైరాలే రైతుసంఘాలలో చేరవద్దని కరపత్రాలు పంచారు. ఆ దుష్ప్రచారానికి రైతులు విరివిగా తమ సంఘంలో చేరి సరియైన జవాబు చెప్పారు. కృష్ణాజిల్లా రైతుసంఘసభ్యత్వం 10 వేల నుండి 35 వేలకు పెరిగింది. ఇపుడు రైతువుద్యమాన్ని చీల్చాలని, అఖిలభారత రైతుమహాసభను బహిష్కరించాలని ప్రయత్నించుతున్న సుబ్బారెడ్డి, వెంకటప్పయ్య వగైరా గార్లకు తగిన సమాధానం ఒకటేవుంది. రైతులు పూర్వంనుంచి తమకు సేవచేస్తున్న రైతుసంఘాన్ని యింకా బలపరచుకోవాలి. కృష్ణాజిల్లాలో జరుగనున్న అఖిలభారతరైతు మహాసభకు విరివిగా సహాయంచేయాలి. రైతుఉద్యమాన్నిచీల్చేవారికి రైతులలో తావు లేదని రుజువుచేయాలి.

★

అ రె స్టు లు

కడపజిల్లా కమ్యూనిస్టు ఆఫీసును 12-11-43 న సోదాచేసి తీసుకొని వెళ్ళిన పుస్తకాలలో ప్రభుత్వంచే నిషేధింపబడిన "అన్నా" 'మాప్లా తిరుగుబాటు' వున్నాయనే నేరంమీద కామ్రేడ్ పి. నరసింహారెడ్డిని 1-1-44 న రాజంపేటలో అరెస్టుచేసి కడప ఆర్. డి. ఓ. దగ్గర కేసుపెట్టారు. కామ్రేడ్ నరసింహారెడ్డి 5-1-44 బెయిలు మీద విడుదలచేయబడ్డాడు. కేసు 8-1-44 కు వాయిదా వేయబడింది.

గొల్లప్రోలులో

గొల్లప్రోలు (పిఠాపురం తాలూకా) లో కామ్రేడ్ యం. భావనాచారిని 31-12-43 రాత్రి, రైతులతో మాట్లాడుతూ వుండగా అరెస్టుచేశారు. యుద్ధబాండ్ల విషయంలో అధికారుల నిరంకుశ ప్రవర్తనను ఎదుర్కొని, రైతుల శక్తిసామర్థ్యాలనుబట్టి యుద్ధబాండ్లను కొనిపించడానికి భావనాచారి కృషిచేశాడు. అలాంటి అతనిని అరెస్టుచేయడాన్ని రైతులు నిరసిస్తున్నారు. యుద్ధకృషికి ప్రజల సానుభూతిని సంపాదించగల ప్రజాసేవకులను ప్రభుత్వం వెంటనే విడిపించాలి.

బుధవారం ప్రజాశక్తి 12-1-44

పోలండ్ ధోరణి

స్టాలిన్‌గ్రాడ్ వద్ద "యశోవా, మృత్యోవా" అని పోరాడి విజయాన్ని పొందినదాదిగా, నేటివరకూ ఫాసిస్టు మూకలను రెడ్‌ఆర్మీ వెన్నంటి తరుముతూనే ఉంది. అపార త్యాగాలనుచేసి, కోటిమంది ప్రజలను నష్టపడి సోవియటు, నాజీ ఆక్రమితయూరపులో మూడింట రెండువంతులకు విముక్తి గల్గించింది. ఈనాడు విజయపరంపరలను చేపడుతోంది. దీనిని జూచి ఆక్రమిత యూరప్ ప్రజలేగాక స్వాతంత్ర అభ్యుదయాల్ని కోరే చిత్తశుద్ధిగల ప్రతివాడూ హర్షింపుతున్నాడు.

అయితే ఈవిజయాలను చూచి విలపించే దెవరు? హిట్లరు, గోబెల్సులు మాత్రమేగాదు. ప్రజాస్వామ్యం అనే ముసుగువేసుకున్న అభివృద్ధి నిరోధకులుకూడా ఉన్నారు.

ఇలాంటి గోముఖ వ్యాఘ్రమే నేడు లండన్‌లోవున్న "పోలిష్ ప్రభుత్వం." సోవియటు సైన్యాలు పశ్చిమ యుక్రైన్‌లో ప్రవేశించగానే, "సోవియటు మా సరిహద్దులలో ప్రవేశించింది. సోవియట్ మాప్రదేశాన్ని కాజేయదని ఆశించుతాం" అంటూ ఈ "ప్రభుత్వం" గోలపెట్టడం మొదలెట్టింది. దీనికి బ్రిటన్ అమెరికాలలోని అభివృద్ధి నిరోధకులు - చివరకు మనదేశంలో కమ్యూనిజాన్ని ద్వేషించే పత్రికలూ- సన్నసన్నగా తాళంవేయసాగాయి.

కాని, లండన్‌లోనున్న పోలిష్ "ప్రభుత్వం" నిజంగా పోలిష్ ప్రజల అభిప్రాయాన్ని వెలిబుచ్చుతోందా? నిజంగా అది పోలిష్ ప్రజాప్రభుత్వమేనా?

యుద్ధానికి పూర్వమే పోలండు, అధికారరీత్యా ఫాసిస్టు రాజ్యమని ప్రకటించకపోయినా, ఫాసిస్టు పద్ధతులతోనే పరిపాలింపబడుతూ వచ్చింది. నిరంకుశ భూస్వాములు, పెట్టుబడిదారులు, సైన్యాధిపతులూ, పోలిష్‌ప్రజలకు ముప్పుతెచ్చిపెట్టారు. మ్యూనిక్ ద్రోహఫలితంగా వచ్చిన భాగంతో సంతృప్తిపడక, హిట్లరు జకోస్లొవేకియా నంతా ఆక్రమించుకొన్నపుడు పోలండుకూడ కొంతభాగాన్ని కాజేసింది. యుద్ధం తనవాకిటముందుకువచ్చిన సమయంలోకూడ, సహాయానికి వస్తానన్న రెడ్‌ఆర్మీ తన దేశంలో అడుగుపెట్టడానికే వీలులేదన్నది. చివరకు హిట్లరు పోలండుపై బడినప్పుడు పోలిష్ ప్రజలు వారి కర్మ వారే అనుభవించుతారన్నట్లు వదిలి పారిపోయింది.

1919 లో సోవియటు ప్రభుత్వం బాల్యావస్థలో ఉన్నప్పుడు పోలండు దురాక్రమణచేసి. యుక్రైన్‌లోను, బైలో రష్యాలోను కొంత భాగాన్ని కాజేసింది. లార్డ్‌కర్జన్‌వంటి సామ్రాజ్యవాది సైతం ఈభాగం సోవియట్‌దేనని తన నిర్ణయం (కర్జన్‌ఎవార్డు) లో చెప్పాడు. అయినా దానిని నిర్లక్ష్యపరచి పోలండ్ సోవియట్ భూమిని ఆక్రమించింది. ఆభాగంలోని కోటీ పదిలక్షలమంది ప్రజలను హిట్లర్ వాతబడకుండా 1939 లో సోవియట్ కాపాడింది.

ఇలా విముక్తిచేయబడిన సోవియటు ప్రజలు పోలిష్ భూస్వాములకు ఊడిగం చేయడం తప్పిపోయింది. ప్రతి రైతుకూ 5 ఎకరాలు, ఒక ఆవు లభించింది.

కాని సోవియటుపై హిట్లరు దురాక్రమణ గావించుటతో వీరు నాజీ చెరలో చిక్కుకున్నారు. అట్టి ప్రజల్ని నేడు రెడ్ఆర్మీ విముక్తిచేస్తోంది.

తమకిద్దరికి శత్రువయిన హిట్లరును పారదోలటానికి సహాయపడుతుందేమోనని సోవియటు, పోలండుకు స్నేహ భావం చూపింది. 1941 లో పోలిష్ - సోవియటు ఒడంబడిక జరిగింది. ఆ ఒడంబడిక ప్రకారం, సోవియటులోని పోలిష్ సైనికులకు, ప్రజలకు ఆర్థిక సైనిక సహాయం చేసింది. కాని, సోవియటులోని పోలిష్ సైనికాధిపతులు చేసినదేమిటి? ఒడంబడిక ప్రకారం యుద్ధభూమికి పంపవలసిన పోలిష్ సైన్యాలను పంపలేదు. పైగా సోవియటు వ్యతిరేక కుట్రలు సాగించారు. సోవియటుకు అనుకూలంగా ఉన్న పోలిష్ సైనికుల్ని ఉరిదీశారు. సోవియటు భవిష్యత్తేగాకుండా యావత్ ప్రపంచ భవిష్యత్తును నిర్ణయించనున్న స్టాలిన్‌గ్రాడ్ యుద్ధకాలంలో ఈ పోలిష్ సైన్యాలను సహాయపడనిచ్చారా? లేదు. వాటిని ఇరాన్‌లో, మధ్యప్రాచ్యంలో ఊరేగించడానికి ఆ సైనికాధిపతులు తీసుకుపోయారు! అందుచేతనే సోవియటు - పోలిష్ ఒడంబడిక రద్దయింది. దానికి కారకులు పోలిష్ అభివృద్ధి నిరోధకులైన పరిపాలకవర్గం.

ఈ ముఠాచర్యలు పోలిష్ ప్రజలుగాని, సైనికులుగాని హర్షించుతున్నారా? లేదు. అందుచేతనే కొందరు పోలిష్ సైనికులు రష్యానుండి విడిచిపోమని అన్నారు. వారు జిగ్‌మండ్‌బెర్లింగ్ అనే పోలిష్ దేశభక్తుని నాయకత్వాన, సోవియటుతో భుజముభుజముకల్పి యుద్ధరంగంలో ఉరికారు. గత ఆగస్టులో పోలిష్ సైన్యపు మొదటిడివిజను యుద్ధరంగంలో ప్రవేశించింది.

రష్యాలోని పోలిష్ దేశభక్తులుగాని, నేడు సోవియటుతోపాటు ఫాసిస్టులను హతమార్చే పోలిష్ సైనికులుగాని లండన్‌లోని పోలిష్ "ప్రభుత్వాన్ని" బలపరచడం లేదు. భవిష్యత్ పోలండును నిర్ణయించేది వారేగాని లండనులోనివాళ్లుగాదు. అఖిల స్లావ్‌జాతుల సభలో పోలిష్ దేశభక్తులు ప్రకటించినట్లు, "పోలిష్ ప్రజల విముక్తి హిట్లరుతో గూడుపుఠాణిచేసే విద్రోహుల చేతులలోలేదు. రష్యన్, యుక్రెయిన్, బైలోరష్యన్ ప్రజల స్నేహంతోను, వారితోకలసి ఫాసిస్టులతో పోరాడుటద్వారాను, పోలిష్ ప్రజలకు విముక్తివుంది."

సోవియటులోని పోలిష్ దేశభక్తులు ఇటీవల ఒక ప్రకటన చేశారు. లండన్‌లోని పోలిష్‌ప్రభుత్వాన్ని వారుఖండించారు. ఆప్రకటనలో వారిచ్చినకార్యక్రమంలోని ముఖ్యభాగాలు: (1) పశ్చిమ యుక్రైన్, బైలోరష్యాలు సోవియటుకు చెందినవే. (2) ప్రజాస్వామ్య పార్లమెంటరీ ప్రభుత్వం పోలండ్‌లో ఏర్పడాలి. (3) అభివృద్ధి నిరోధకులందరినీ తొలగించి భూమి రైతులకు పంచిపెట్టాలి. (4) అభివృద్ధి నిరోధకులు మినహా, తక్కినవారంతా, ఏ రాజకీయపార్టీకిచెందినా ఐక్యంకావాలి. స్టాలిన్ వాంఛించిన "ఐక్య పోలండు, బలిష్ఠమైన పోలండు" పైనచెప్పిన పోలిష్ దేశభక్తుల కార్యక్రమంద్వారానే నిర్మించబడుతుంది. రెడ్‌ఆర్మీ అట్టి పోలండు నిర్మాణానికి సహాయపడుతుంది.

లండన్‌లోని అభివృద్ధినిరోధక పోలిష్ ముఠాగాని, బ్రిటన్ అమెరికాలలోని అభివృద్ధినిరోధకులుగాని, సోవియటు విజయాలనుచూచి ఏడుస్తున్నారంటే ఆశ్చర్యం లేదు. కాని బానిసవిముక్తికి తహతహలాడే మనదేశంలోకూడ కొన్ని పత్రికలు లండన్‌లోని పోలిష్ అభివృద్ధినిరోధకులను బలపరచడంచూస్తే ఆశ్చర్యం వేస్తుంది. కమ్యూనిజంపై, సోవియటు రష్యాపై తమకుగల అక్కసు ఇలా తీర్చుకోవాలని వారి ఆశ. మనదికాని బళ్ళారికే మనవాళ్లు కొందరెంతో దుగ్ధపడుతున్నారే! అలాంటప్పుడు దాదాపు ఆంధ్రదేశంలో సగభాగం జనాభా ఇతరులక్రిందవుంటే మనం సహిస్తామా? అందుచే నిజమయిన జాతీయవాది, రాష్ట్రీయవాది, బైలోరష్యన్ - యుక్రైన్ ప్రజలను పోలిష్ నిరంకుశ ప్రభువుల దాస్యంక్రిందనే ఉండాలని కోరడు. తమ మాతృదేశంలో ఆ ప్రజలు కలియడాన్నే హర్షిస్తాడు.

★ బెంగాలులో

పంటపుష్కలంగానే పండింది; కాని ప్రజల కందడంలేదు !

— కంభంపాటి సత్యనారాయణ

బెంగాల్‌లో ఈయేడు శీతాకాలపు "వరి" పంట పుష్కలంగానే పండింది. గత సంవత్సరం రాష్ట్రానికంతకూ 73 లక్షల టన్నుల ధాన్యంపండితే ఈయేడు 97 లక్షల టన్నుల వరకు పండుతుందని ఇండియా ప్రభుత్వం అంచనావేసింది. ఇందులో శీతాకాలపు పంట 83 లక్షల టన్నులని బెంగాల్ ప్రభుత్వపు అంచనా. అనగా, గత సంవత్సరపు శీతాకాలపు పంటకంటే 100 కి 66 చొప్పున హెచ్చిందన్నమాట. కోతలుకూడా పూర్తి కాబోతున్నాయి. కాని, మార్కెట్లో బియ్యంధర పెరుగుతూందేగాని, తగ్గడంలేదు. నిలవవ్యాపారస్తుల మార్గంలో ముస్లింలీగ్ మంత్రివర్గం ఎట్టి ఆటంకాలు కలుగజేయకుండా, స్వేచ్ఛా వ్యాపారానికి అవకాశమిచ్చినట్లయితే ధరలు పెరుగవనీ, కరువుబాధ తొలగిపోతుందనీ, వాదించినవారి ఆర్గ్యుమెంట్లన్నీ తల క్రిందులౌతున్నాయి.

మైమన్‌సింగ్‌లో రెట్టింపుపంట....కాని?

పంట యెక్కువ పండుతూన్నా, ధరలు ఎందుకిలా పెరుగుతున్నాయి?

మైమన్‌సింగ్ జిల్లా విషయం చూదాం. ఈ జిల్లాలో క్రిందటి సంవత్సరంకంటే ఈయేడు రెట్టింపుపంట పండింది. డిసెంబరు మొదటివారంలో నలితాబారి, సుసాంగ్ మొదలైన ఏరియాలలో బియ్యం ధర మణుగు 1 కి రు 3, రు 4 మాత్రమే ఉండేది. కాని బెంగాలు ప్రభుత్వం సరుకును కొనడానికి ముందుకు రాలేదు. పంట యెక్కువగా పండడంవల్ల ధర బాగాతగ్గి, అదే నిలకడగా వుంటుందని లీగ్‌మంత్రివర్గం ఆశించింది. మామూలు వర్తకపు విధానమే కొనసాగుతుందనీ, తాము పెద్ద పెట్టున మార్కెట్లో కొనదలచుకోలేదనీ, సప్లయి శాఖమంత్రి సుహ్రావర్ది ప్రకటిస్తూ వచ్చాడు. నిలవ వ్యాపారస్థుల కింతకంటే కావలసిందేమిటి? వెంటనే రాబందులవలె పల్లెటూళ్ళలో ప్రవేశించారు. ఎక్కువధర లిచ్చి పంటనుకొనివేయసాగారు. ఈవిధంగా డిసెంబరు రెండోవారంలో బియ్యంధర నలితాబారి, షేర్‌పూర్ మార్కెట్లలో రు 14, 15 ల వరకు పెరిగింది. మైమన్‌సింగ్ పట్టణంలో యీరోజున బియ్యం దొరకడమేలేదు!

సరుకంతా కొనేది ఎవరు?

ఈ సరుకంతా ఎవరుకొంటున్నారు? ప్రభుత్వఏజంట్లు కొనడంలేదు. సైన్యం అసలే కొనడంలేదు. స్థానికదళారులు, ఢక్కా-జిల్లాయందలి నిలవవ్యాపారస్థులు కొంటున్నారు. ఆ ఢక్కా-జిల్లాలోనైనా ప్రజల కందజేస్తున్నారా అంటే, లేదు. మణుగు రు 27 చొప్పున దొంగమార్కెట్లో అమ్ముతున్నారు!

ఎక్కువధరకు కొనడం, అంతకంటే యెక్కువధరకు అమ్మడం — యిదీ తిండి దొంగల ఆట.

ఇక ప్రభుత్వ ఏజంట్లుగాని, సామాన్య వర్తకులుగాని, కంట్రోలు ధరలకు బియ్యం కొనడం ఎలాసాధ్యం? సరుకు అంతా తిండి దొంగల గిడ్డంగులకే చేరుతోంది. ఒకేసారి 2 మణుగుల కంటె ఎక్కువ బియ్యాన్ని రైలులో తీసుకుపోకూడదని బెంగాల్ ప్రభుత్వం ఒకఉత్తరువు జారీచేసింది. కాని, తిండి దొంగలు 50 టిక్కెట్లు చొప్పున కొనడం, ఒక్కొక్క టిక్కెట్టుకు 2 మణుగుల చొప్పున బియ్యంచేరవేయడం - యిలా నిలవ వ్యాపారం విచ్చలవిడిగాకొనసాగుతోంది.

ఇతర జిల్లాలలో

ఇతర జిల్లాలలోకూడా పరిస్థితులు యించుమించు ఇలాగే ఉన్నాయి. జల్పైగురిజిల్లాలో టీ తోటల యజమానులు, పెద్దపెద్ద కంపెనీ ఏజంట్లు, రైసుమిల్లు ప్రొప్రయిటర్లు, మార్కెట్లలో ప్రవేశించి, విపరీతమైన ధరలకు కొత్త పంటను కొనేస్తున్నారు. కొన్నిచోట్ల, భూస్వాముల వద్దనున్న స్టాకును ప్రభుత్వం తక్కువ ధరకు లాగు కొనబోతూన్నదనే ప్రచారం విరివిగా వ్యాపించింది. అందువల్ల భూస్వాములు ఎక్కువ ధరలకు అమ్మివేస్తున్నారు. మరికొన్నిచోట్ల తిండిదొంగలు అమాయకులైన రైతులవద్ద కెళ్లి, తామే ప్రభుత్వం తరఫున కొంటున్నామని బుకాయిస్తున్నారు. 1000 మంది కంటె ఎక్కువ కూలీలచే పని చేయించుకొను టీ తోటల యజమానులు మార్కెట్లలో సదాసరి కొనకూడదని ఒక నిషేధం ఉంది. కాని, ఈ యజమానులు దొంగ లెక్కలుసృష్టించి. (మిగతా 7వపేజీ)

★ దేశంకోసం

(చిన్నకథ)

రైలుగేటుదాటి అవతలకిచూస్తే కూలీల గుడిసెలు కనిపిస్తున్నాయ్. గూడెంలోంచి పైకిచూస్తే గుడ్డలమిల్లు పొగగొట్టం విచ్చు తుపాకివలె నించుంది....ఎందుకో కూలీలంతా బేజారై అల్లరిపడుతున్నారు. తేనెపట్టుమీద రాయివిసిరితే చెలరేగిన ఈగల్లా, అంతాఆడావుడీ అలజడీ. కోటయ్య మధ్యమధ్యఎగిరెగిరి పడుతున్నాడు. తలబిరుసూ తిక్కా యజమాని కరువుభత్యం ఇవ్వనంటాడు. "కరువొచ్చింది ధరలుపెరిగాయి. గజంగుడ్డ పూర్వం పావలాకిచ్చేవారు. అదే ముచ్చువుక. ఇపుడో! రూపాయమారిస్తే మంది కానేకాదు. బతగ్గలమా? మీలాంటి గొప్పవాళ్ళే అలాఅంటే, కోటయ్యలాంటి కూలీలసంగతేమిటి? సంసార్లు, మీకు తెలియందేముంది? ఉప్పుగల్లా దివ్వెకినూనీ, వర్రసుండా గుడ్డా గుడిసీ.... నత్తానానా వాళ్ళకీ వున్నారుకద! రోగాలు రొచ్చులూ.... ఏనుగులాంటి సంసారం! ఇచ్చేఅర్ధ ఏమూల? మునిసిపల్ పనివాళ్ళు కరువుభత్యం తెచ్చుకున్నారు....నెలకి ఎనిమిదిన్నర రూపాయలువస్తాయ్." అంటూ కూలీలంతా కలిసి కోటయ్యద్వారా యజమానిని కరువుభత్యం అడిగారు. యజమాని గంగ వెర్రులెత్తి, ఎదరగానించున్న కోటయ్యని ఉరుముతూ—

"ఎవరోతెలుసా? ఇది కోమటిబిడ్డ, మోకాలిచిప్పలు విరగతీయిస్తాను! సంఘాలూ.... సమ్మెలూ!"

కరువుభత్యం ఇవ్వకపోడానికి మరోకారణం యజమాని కడుపులో "లివరో" జబ్బులా పెరిగిపోతూంది. అది సంఘం పెట్టుకోటం. "సంఘాలట! సంఘాలు! తలపరువు నోరు చెపుతుందనీ....నాదగ్గరకాదురా నీవేషాలూ!" అన్నాడు యజమాని.

"మేకల్లాంటి వెధవల్నందర్నీ పాపం చెడగొట్టేస్తున్నాడు! ఈపళంగా పోలీసులొచ్చి మీఅందర్నీ తంతే దిక్కెందిరా? వాళ్ళని చూసి వీళ్ళు, వీళ్ళనిచూసి వాళ్ళు!" పనివాళ్ల సంఘాలుగా కూడినప్పుడల్లా పోలీసులు యజమానుల కనుసన్నల్లో గస్తీ తిరుగుతున్నారని అతని ధీమా! లేకుంటే మోకాలిచిప్పలు వలిపిస్తాననీ—నల్లిని నలిపినట్లు నలుపుతాననీ అంటాడూ? "మీకు సంఘాలెందుకు? మీ వొంటిమీద జుబ్బాలెందుకు?" అదే యజమానిప్రశ్న. కోటయ్య చెప్పలేకపోయాడు. నచ్చచెప్పండి బాబూ, మీరే నచ్చచెప్పండి, అర్ధరూపాయ చేతికందితే దానికి లెక్కలొస్తాయ్. అదేంచిత్రమో ఎగిరెగిరి యజమానుల చేతుల్లోనే వాలతాయ్. చిత్రవిచిత్రమైన జూదం! ఏమిటీ అన్యాయం? ఎందుకింత అక్రమం? గాలికిపుట్టేరూ ధూళికి పెరుగుతారు! అర్ధాకలితో పడుకుని, నిండాకలితో పనికిపోవడం. కునుకుతూ జీవితం—ఈదురోమనే పిల్లలు! నరాలన్నీ ఆకలితో దిగలాగేస్తూంటే, కరువుభత్యంపూసే ఎత్తడు, పైగా తన్నిస్తానని! సంఘాలెందుకని! కామ్రేడ్ వచ్చి మిల్లుకూలీ సంఘాలు ఏర్పరచాలంటే, కొంతమందిని ఇంటికి పిలిపించి హెచ్చుజీతాలిస్తానన్నాడు. కోటయ్య సంఘస్థాపనకి కృషిచేస్తే తన్నిస్తాననీ, పనిలోంచి పీకేస్తానని అదిరింపు! జడిపింపు! కోటయ్య లొంగలేదనికోపం! కరువుభత్యం అడిగితే ఎందుకిస్తాడు! లక్షరూపాయలు చేతులో మీరంతా పోస్తే, ఎనిమిది రూపాయలు ఇవ్వడానికి కడుపుమంట!

"నీకు ఇవన్నీ ఎవరుచెప్పేరో వారేఇస్తారు. దీనిఅంతు చూస్తాన్రా కోటయ్యా! మూడు చెరువులనీళ్లు తాగిస్తాను!"

"కడుపుమంట, కరువుబత్తెం ఇమ్మంటే అన్నేయమేముందీ?"

"ఛఫ్.... లావద్దతులు మాట్లాడతావ్! వెధవ....పో....అవతలకిపో"

"తిట్టకయ్యో! నానూ వుప్పూ వర్రా తింటున్నాను!"

కోటయ్య వొళ్ళు గంగవెర్రులెత్తింది, ఎందుకింత జులుం? ఏమిటి తింటారు తన పిల్లలు ఈకరువు కాలంలో? లొంగిపోతే లోకువ! యజమానికి చులకన!

"అదే నే సూదాల! మీరెవరూ పనికెళ్ళద్దు. పనికెళ్ళినాడు జాతీ నీతీ లేనోడు!"

కోటయ్య గుడ్లలోంచి రోషం కక్కుతూంటే, గవరయ్య— "రెక్కాడితే డొక్కాడుద్ది! పనికెళ్ళకుంటే ఆడికే టొచ్చిందీ?"

అని అంటున్నాడు.

"నీకు జాతీ నీతీనేదురా గవరయ్యా"

"నానేం జాత్తక్కువ్వాడిని కానురోరి!"

"కరువుబత్తెంనేదూ! పైగా తన్నిత్తాడంట. ఏదోసూద్దారి!"

"పని మానాలేని!"

"బువ్వేదిరా!"

కూలీల్లో రెండుపాయలు. సమ్మెఅని కోటయ్యా, వద్దని గవరయ్యా, అటూ ఇటూ అడావుడిలో రేగిన ఉడుకుమోత్తనంతో—కోటయ్య "పనికెళ్ళొద్దు!" అంటున్నాడు. గవరయ్య తనలాగే ఏమీతోచని పెద్దదిక్కు ముసలమ్మ గుడిసెకెళ్ళి కూచున్నాడు. ముసలమ్మ అసలే విచారంగావుంది! తల చూడండటు! మోకాళ్ళమీదుంచుకుని కునుకుపాట్లు పడుతూంది. అంతా తనకి కావలసినవాళ్ళే! అందరూ తనని మామ్మా అనేవాళ్ళే! అటువంటి కూలీలు పనికెళ్ళకపోతే, పోలీసులు-కాల్పులు-అల్లరి-తన్ని పంపించడానికి వచ్చినవాళ్ళు కరువుభత్యం ఇప్పించలేరూ? న్యాయంకాదూ?.... వాళ్ళంతా ఝల్లుమంది. నీరసంగా నరాలన్నీ గానుగలో తిరిగిన చెరుకుకర్రల్లా పీకుతున్నాయ్! అసలే విచారం! కొండంతకొడుకు చిన్నప్పుడు జబ్బుచేస్తే వాతలుపెట్టి దక్కించుకుంది. చెప్పకుండా చెయ్యకుండా పటాలంలో కెళ్ళిపోయాడు. నల్లగ, జబారుమనిషి. బాగా చెయ్యెత్తుపొడుగు! నాలుగునెలలకితం వచ్చి అందర్నీ కూడేసి యెన్నెన్నో చెప్పాడు పటాలంసంగతులు! అమెరికా దొరలు పటాలంలో ఎలావుండేవారో, వాళ్ళెంత కనికారంగా వుండేవారో చెపుతూ "ప్రైజలయుద్ధం" అని చెప్పుకొస్తే, కోటయ్య సంతోషం పట్టలేక సందిడితో మీది కెత్తేశాడు! ముసలమ్మకి కొడుకు ఎలాగున్నాడో—ఎక్కడున్నాడో.... తిండీ గుడ్డా వుందో లేదో....పాపం చలిరాత్రులు! మనసు అటు లాగింది, జాలి ఇటు లాగింది. గుడిసెల్లో అర్ధాకలితో డొక్కలెగరేస్తూ కూలీలపిల్లలు! గాలివానకి గూడు ఎగిరిపోయి తడిసిపోతూ మూలిగే పక్షుల్లా తనలాంటి తల్లులు! ఆకాశమే ఇంటికప్పు. నీళ్ళేగంజి! పూర్వం తెలుసున్న తల్లులు ఇన్ని గంజినీళ్ళయినా పోసేవాళ్ళు! అదీ లేదు. చెప్పినా, యజమాని వినలేదు. కడుపులో దీపం పెట్టినట్లుందన్నాడు కోటయ్య. "రక్తం కళ్ళచూస్తానని" యజమాని.... ముసలమ్మ గుడిసెలో తనలాగే అర్ధాకలితో దీపం చమురు తాగుతూ కునుకుపాట్లు పడుతోంది.

"గవిరయ్యా! అయనొచ్చిందాకా, వల్లకుందాంరా!"

"అలా సెప్పినాను మామ్మా! ఇనడాడు!"

"కొడుకు పటాలంలోంచి వత్తాదంటావురా?" ముసలమ్మకి ఇదేబెంగ. "తప్పక వస్తాడు మామ్మా" అని కామ్రేడ్ చెప్పినపుడు ముసలమ్మకి ధీమావచ్చేది! అతను ఎందుకలా కష్టపడాలి? ఎండనక వాననక, కోటయ్యలాగే కష్టపడతాడు. చదివిన చదువు పెద్దదే! కూలీల్లాగే ఎందుకు అతనలాగ శ్రమించాలో ముసలమ్మకి బోధపడిందికాదు. కామ్రేడ్ గూడెంలోకొచ్చాక— ముసలమ్మ "సాలా వూసులు నేర్చుకుంటున్నాంరా కోటయ్యా" అనేది. ఎర్రసైనికుడు రష్యామంచుని చేదించుకుంటూ, తిరోగమించేశత్రుసైనికుల్ని వెంటాడుతూండడం కనిపిస్తూనే వుంది. మాస్కోమిల్లులోకి కార్మికులు ఎంతఉత్సాహంగా వెడుతున్నారు! పిల్లలు పాఠాలు వల్లెవేసుకుంటున్నారు. తుపాకి పుచ్చుకుని స్త్రీలుముందుకు ఉరకలువేస్తున్నారు. అందుకే రష్యాకు ఎదతెరిపిలేని విజయాలు....ముసలమ్మదగ్గి, ఇటుతలుచుకుంది. తనకీ, ప్రభుత్వానికీ చుట్టరికంలేదు. కరువుభత్యంఇమ్మంటే "పోలీసులచేత తన్నిస్తాను—వెధవ" అని జవాబు. బియ్యంకోసం యుద్ధం దొమ్మీ-కిరసనాయిలు తెచ్చుకోడం యజ్ఞంచేయడం. ఉత్తరంవస్తే పొరుగింటికి పోయిచదివించుకోవాలి! "ఈ అన్నేయం ఎపుడైనాపోద్దా?" అనిముసలమ్మ, కామ్రేడ్ చెపుతూంటే చూసేదతన్ని. ఆచూపులు తన దేశానికలావస్తుందా? అనీ. ఆమంచిదినాలకి కోటికళ్లతో జాగరంవుండేది.... ఆకలి! కరువుభత్యం....

'అవసరాల'

"పనికి ఎల్లినోడు పుండాకోరు!" అనే కోటయ్య ఉరుములూ, "బువ్వేదిరా!"అంటూ గవరయ్యా, ఇద్దరి మధ్యనా ముసలమ్మ! తెల్లారితే పనులు కెళ్లడమా, మానడమా? అని మిగిలినకూలీలు. ఎద్దుఎండకీ, ఎనుపోతు నీడకీ! కొందరటూ కొందరిటూ....ఏమీ తోచలేదు. భయం! తనగూడేనికొచ్చిపోలీసులు! ఒకడూ, ఇద్దరూ,ముగ్గురూ..లాఠీలతోకొట్టి.. కోటయ్యని పనిలోకి లాక్కెడుతున్నారు! కోటయ్యానా? కోటయ్యే!....ఆకలనీ ధరలు పెరిగాయనీ.... బతకలేమనీ.... కరువుభత్యం ఇప్పించండనీగోల గోల! ఘోరం! పనిచేసేవాడికి తిండిలేదు. ఆకలితో "గంజినీళ్లో" అని పిల్లలు! కుక్కకూడా విసుపోయి పొయ్యిబుగ్గిలో పడుకుని చూస్తోంది. కోటయ్య పెళ్లాం, అన్నెం పుణ్యం ఎరగదు....ఏడుపు. ముసలమ్మకు, కళ్లుమూసుకుంటే కనబడింది యిదీ! "పనిలో కెళ్లండి." "వెళ్ళితే కరువుబత్తెం రావడం?" రెండూ ప్రశ్నలే. బాకుల మధ్య ముసలమ్మ తలతిరుగుతోంది.

తెల్లారితే పనికెళ్లద్దని కోటయ్యా, మరి కొంతమందీ చెప్పిచెప్పిగద్దించారు. పనికెళ్లరు. ....గొట్టానికి పొగలేదు. మిషన్‌కదలదు.

ఎక్కడ సరుకక్కడా.... పనికివెళ్లరు! పోలీసులొచ్చి వెళ్లాలాకాతంతారు. కాలుస్తారు. పనికివెళ్లరు. వచ్చేఫలితం? గుడిసెలోదివ్వ లేదు. పొయ్యిలో అగ్గిలేదు. కడుపుకి అర్ధాకిలికూడా దొరికే పుణ్యం వుండదు. ఈదురోమని పిల్లలు కాళ్లావేళ్లాపడుతూ వెళ్లారు!.... గవరయ్య సన్నసన్నంగా గుడిసెపక్కమలుపు తిరిగాడు. కూజామరికొందరూ! కోటయ్య దారికాని, చిరుగుల జుబ్బాని సవరించుకుంటూ "పనికెళ్లినోడు జాత్తక్కువోడు" అని అరిచేడు. గుడిసెలోంచెవర్నీ పైకిరానీయడు, వచ్చినవాళ్లని వెళ్లనీయడు! మిల్లు బుయ్‌మని అరిచింది. ఓసారీకాదు, రెండుసార్లూకాదు, మూడునాలుగుసార్లు, ఏడుగంటలయింది....ఎనిమిదీ.... ఎవరూ పనికి వెళ్లరు! సందుచివర్నగుడిసెల్లో దేవరవాడు దబ్బాకాఫీఅమ్ముతున్నాడు. తాగి కూలీజనం చెదిరిపోతూ, అటూఇటూ చూస్తున్నారు.... మళ్లీగొల్లున గోల! సముద్రంలా గవరయ్య తోచాలామంది పనికివెడుతున్నారు. ముందు గవరయ్య! కాజాలకు కట్టుకున్నతాడు బిగించుకుంటూ.... దొరికినబూడ్పు లూజ్‌గాలాగుతూంటే ముందుకి...."గవిరయ్యా!"అని కేక.

"నానాగనేని"

"ఎళ్ల ఎళ్లు! ఎళ్లరా!" అని కోటయ్య గవరయ్యను బతిమాలినా, తిట్టినా, కొడతానన్నా ముందుకే....సందుమళ్లేడు. చూరులు రాసుకుంటూ, మురికికాలవ దాటాడు. పెద్దసందు మలుపుమలుపు తిరిగాడు. ఆ(....అప్పను, తిరిగి పనిలోకే అడుగులు! వెనకాల వీపుమీద చల్లటిచేయి రెక్కపట్టుకుని గుంజింది. రైలు ఆగేటపుడు వెనక్కిముందుకి కుదిపినట్లు....

"గవరయ్యా!" అని కామ్రేడ్.

"బాబ్బాబు!"

"ఎక్కడికోయ్!"

"సమయాని కొచ్చినోరు!"

"కోటాయ్య దగ్గిరకి రా!"

"పదండిబాబు! సూత్రమేటో సెలవియ్యాల!"

నడుస్తూ కామ్రేడ్ ఆలోచనలో పడ్డాడు.

"తనదేశం! తనకూలీ రైతుజనం! చదువూ సంధ్యలులేవు. రెక్కలు విరిగేటట్లు శ్రమ....తగ్గ ఫలంలేదు. అణచాలని కరడుగట్టినవర్తక ప్రబుద్ధులు కుయత్నాలుచేసిచేసి, విఫలమయారు! కోటిగొంతుకలు "కో"మంటే కూలీరాజ్యానికి రక్షణ! ప్రపంచం విస్తుపోయింది. హిట్లర్ సైన్యాలు డాన్‌నదిలో గడ్డకట్టుకుపోవడంతో ప్రపంచజనాల స్వాతంత్ర్యం సురక్షితమైంది. బ్రిటన్‌లో, అమెరికాలో, ప్రజలు భారతదేశానికి స్వాతంత్ర్యం ఇమ్మని ఆందోళన! ఫాసిజానికిక పుట్టగతులేవ్! తమ అమూల్యరత్నమయ కిరీటాలను రాజులు ప్రజల పాదాలముందుపడవేసిపోయే కాలంఇది! వస్తోంది. పేదలులేనిరాజ్యం, అంతులేని సుఖం, ఆయాసంలేనిపని, హామీగల జీవితం. కాని కోటయ్య "పనికెళ్లినోడు జాత్తక్కువోడు!" అన్నాడు! బెంగాల్‌లో ఆలగా జనం రోజుకిలెక్కలేనన్ని చావులు! విషాదగొంతులలో ఆర్తనాదాలు! జనం అరాచకపు పాలయితే..కరువొస్తే,నిరాశ...నిస్పృహ.... పొంచుండిన రాబందు జపాన్‌కు అవకాశం! కలకాలం దాస్యజీవితం! వీరమరణమా? స్వాతంత్ర్యమా? గుడ్డలు బేళ్లబేళ్లుగా కోటయ్య తయారుచేస్తాడు. కొనుగోలుశక్తి ప్రజలకు హెచ్చుతుంది, ఆర్మీలో గుడ్డలకరువుండదు! ధైర్యంగా దేశం నిలబడుతుంది. బెంగాల్‌లో మరణించిన బీదజనానికిఇంగ్లండు ప్రజలు కంట తడిచేసుకున్నారు. అమెరికా గగ్గోలు పెడుతూంది. వివిధదేశాలప్రజలూ చేతులుచేతులుకలిపి (మిగతా 8వ పేజీలో)

హైదరాబాదులో ప్రభుత్వ కమాండరింగు స్కీము

హైదరాబాద్ స్టేటు ప్రభుత్వం ఈమధ్య రైతులవద్ద ధాన్యం కమాండీర్ చేయుటకు ఉత్తరువులు జారీచేసింది. కాని వాటిని అమలు జరపడంలో స్థానికాధికారులు అవలంబించే నిర్బంధ పద్ధతులవల్లను, అసలు కమాండీరింగ్ పద్ధతివల్ల కలిగే ఉపయోగాన్ని గురించి రైతులు తెలుసుకొనక పోవడంవల్లను, వారిలో విపరీతమైన అసంతృప్తి వ్యాపించింది. అదిలాబాద్ తాలూకా ఆంధ్రమహాసభ సభ్యులు యీ సమస్యను గురించి గ్రామాలలో ప్రచారం చేయనారంభించారు. కమాండీరింగు పద్ధతివల్ల ఆహారసమస్యను ఎలా పరిష్కరించవచ్చునో తెలియజేస్తూ కొన్ని సూచనలిస్తున్నారు. తత్ఫలితంగా రైతులు ప్రభుత్వ స్కీమును బలపరుస్తున్నారు. ఈ క్రింది సవరణలు గావించవలసిందని కోరుతూ 40 గ్రామాలనుండి మహజర్లు పెట్టుకున్నారు.

1. ఈ తాలూకాలో ఎక్కువభాగం చెల్కా, బర్కం (మెట్ట) భూములగుటచే యకరానికి ఒకటి రెండు మణుగులకంటె ఎక్కువ జొన్నలుపండవు. అందువల్ల ప్రభుత్వం ఇప్పటిమాదిరిగా యకరానికి 1 మణుగు జొన్నలు చొప్పున కాకుండా, తెలింగానా జిల్లాలలో మాదిరి ½ మణుగుచొప్పునకొనాలి. ఇలాగే. మెరక వరి యకరానికి ½ మణుగు చొప్పున, పల్లపు వరి 1 మణుగు చొప్పున, కొనాలి.

2. కొనుటకు ముందు రైతుయొక్క కుటుంబావసరాలకొరకు, విత్తనాల కొరకు కొంత మినహాయించాలి.

3. పల్లపుధాన్యం కవులుదార్లవద్ద కాకుండా పట్టాదార్లవద్ద కొనాలి.

4. ప్రతిగ్రామంలోను ఒక చౌకడిపోను తెరవాలి.

5. కొనుటకు ముందు కంట్రోలు ధరను ప్రకటించి, సరుకునుకొన్న వెంటనే ఆ సొమ్ము రైతుకు చెల్లించివేయాలి.

6. ఇతరజీవితావసరాలు చౌకగాలభించేటట్లు వాటికి ధరల కంట్రోలును అమలుపర్చాలి.

7. నిలవ వర్తకులవద్ద కూడా సరకును కొనాలి.

8. ప్రజాసంస్థల సహకారంతో ఈకమాండీరింగ్ స్కీమును జయప్రదంగా నిర్వహించాలి.

ఈ మహజర్లద్వారా రైతులు జిల్లా కలెక్టరుపై ఒత్తిడితీసుకొచ్చారు. దీని ఫలితంగా, మెట్టవరి యకరానికి 2 మణుగుల చొప్పున కాకుండా, ఒక మణుగు చొప్పునమాత్రమే కొనాలని ఉత్తరువులు జారీ చేయబడ్డాయి. ఇతర ధాన్యాలకుకూడా తగ్గించవలసిందని ఆంధ్రమహాసభవారు ఆందోళన చేస్తున్నారు.

రాగి పండించే రైతుల సమావేశం

★

ఒంగోలుతాలూకా, కనుపర్తి గ్రామంలో గతనెల 30 వ తేదీని వివిధగ్రామాలనుండి వచ్చిన 40 మంది రైతు ప్రతినిధులతో సమావేశం జరిగింది. శ్రీ కొంపెల్ల ఆదినారాయణగారు దానికి అధ్యక్షత వహించారు. సమావేశానికి వివిధగ్రామాలనుండి 600 మంది రైతులు ప్రేక్షకులుగావచ్చారు. వీరంతా రాగిపైరును పండించే పేదరైతులు. సరియైన ఎరువుల సప్లయిలేక, పంట నష్టమవుతోంది. తమ యిబ్బందులనుగూర్చి చర్చించుకొని, కార్యక్రమాన్ని నిర్ణయించుకోవడానికి వీరంతా కనుపర్తిలో సమావేశమయారు.

జిల్లారైతుసంఘాధ్యక్షులైన కొల్లా వెంకయ్యగారు సమావేశాన్ని ప్రారంభిస్తూ, అధికాహారోత్పత్తికి రైతులు నెరవేర్చవలసిన కర్తవ్యాన్ని వివరించారు. తరువాత, యీ క్రింది తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించబడ్డాయి:

1. బాపట్ల, చీరాల, వేటపాలెం, కడకుదురు, చినగంజాం, అమ్మనబ్రోలు, ఒంగోలు స్టేషన్లకు కనీసం 2000 బస్తాల మిక్స్చరు, 200 బస్తాల అమోనియా, సప్లయిచేసి యీ కారుపైరును కాపాడవలసిందని ప్రభుత్వాన్ని కోరారు.

2. రసాయనిక ఎరువులు సక్రమంగా పంపకం జరిగేటందుకు రైతుసంఘ ప్రతినిధులతో కూడిన కమిటీని ప్రభుత్వం ఏర్పరచాలి.

3. ఎరువులు, వగైరా వ్యవసాయ వస్తువుల అమ్మకం కొరకు వ్యవసాయశాఖ తరఫున స్టోర్సు తెరువబడాలి.

4. ఎరువుల పంపకంలో జరుగుతూన్న అన్యాయాలను ప్రభుత్వం విచారించి, అధికారులపై తగుచర్య తీసుకోవాలి.

పల్నాడుతాలూకా కరువునివారణసంఘం

★

పల్నాడుతాలూకాలో గత 2 సంవత్సరాల నుండి వరుసగా పంటలుపండక, ధరలు విపరీతంగాపెరిగి, పనులులేక, ప్రజలు కరువు రాక్షసికి బలి అవుతున్నారు. రాయలసీమ పరిస్థితి పల్నాడుకు యీ సంవత్సరం వచ్చేటట్లు కనబడుతూంది. ప్రజలంతా చచ్చేస్థితి వచ్చేవరకూ చేతులు ముడుచుకొని కూర్చోవడం ప్రజాసేవకుల లక్షణంకాదు. ఈ సమస్యపై అన్ని రాజకీయపార్టీల దేశభక్తుల్ని సమీకరించుటకు జిల్లారైతుసంఘం, జిల్లా కమ్యూనిస్టుపార్టీ, కృషిచేశాయి. తాలూకాలోని 20 గ్రామాల ప్రముఖుల్ని స్వయంగా కలుసుకున్నారు. 30 మందికి ఉత్తరాలువ్రాసి 2-1-44 వ తేదీని తాలూకా క్షామనివారణ సభను యేర్పాటుచేశారు. సభకు 17 గ్రామాల నుండి కాంగ్రెసువాదులు, ముస్లిములు, రైతుసంఘ వర్కర్లు మొత్తం 40 మంది వచ్చారు. వీరు యీ క్రిందివారితోకూడిన కార్యనిర్వాహక వర్గాన్ని ఎన్నుకున్నారు:

అధ్యక్షులు: శ్రీనాళం మట్టపల్లిగారు

ఉపాధ్యక్షులు: శ్రీ దుగ్గిరాల చంద్రశేఖర శాస్త్రిగారు, వకీలు

కార్యదర్శి: శ్రీ నడింపల్లి సుబ్బారావుగారు

కోశాధికారి: శ్రీ దిడుగు గోపాలకృష్ణ మూర్తిగారు, వకీలు

వీరుగాక, మరి 11 గురు సభ్యులు ఎన్నుకోబడ్డారు.

జిల్లాలో ముఖ్యంగా, రేపల్లి, తెనాలి, బాపట్ల, తాలూకా రైతుసోదరు లందరు యీ కమిటీద్వారా తమ వద్దనున్న మెచ్చుధాన్యాన్ని ప్రభుత్వ కంట్రోలు ధరకు సప్లయి చేయవలసిందనీ, ధన - ధాన్య రూపేణా విరాళాలీయవలసిందనీ, జిల్లా రైతుసంఘ జాయింటు కార్యదర్శి విజ్ఞప్తి చేస్తున్నారు.

యుద్ధబాండ్ల సమస్యపై ప్రజాసమీకరణ

కృష్ణాజిల్లా నందిగామ తాలూకాలో, కొణిదర్ల - నెమలి - ఉమ్మడి - దేవిపల్లె గ్రామాలలో వేరుసెనగ, జొన్న వగైరా పంటలు కొద్దిగా మాత్రమే ఫలించినప్పటికీ, యకరం 1 కి రు. 10 చొప్పున రైతులందరూ ఋణ పత్రాలను కొనవలసిందని స్థానిక తహసీల్దారు రైతులపై ఒత్తిడితీసుకొచ్చాడు. 1500 మంది జనాభాగల కొణిదర్ల గ్రామస్థులు 28 వేల రూపాయలు చెల్లించాలని పట్టుపట్టాడు. చెల్లించలేని రైతులు ఏమిచేయాలో తెలియక నిస్పృహతో నిండిఉన్నారు.

స్థానిక కమ్యూనిస్టులు ఇదిచూచి, అధికారుల నిర్బంధ విధానాన్నుండి రైతుల్ని రక్షించడానికి, యుద్ధకృషికి ఇష్టపూర్వకంగా సహాయాన్ని చేసేటట్లు ప్రోత్సహించడానికి, గ్రామములోని రైతులందరినీ సమావేశపరిచారు. కొనగలిగిన వారందరినీ కొనవలసిందని హెచ్చరించారు. యీ విధానానికి రైతులు అంగీకరించి, 5 గురు సభ్యులతో ఒక కమిటీని ఎన్నుకున్నారు. ఆ కమిటీసభ్యులు బీదవారిని మినహాయించి, మిగతావారి శక్తి సామర్థ్యాన్నిబట్టి రు. 4480 చెల్లించాలని నిర్ణయించారు. ఈ మొత్తాన్ని చెల్లించుటకు కొంతవ్యవధి ఈయవలసిందని తహసీల్దారును కోరగా, ఆయన యకరం 1కి రు. 10 చొ॥ ప్రతివారూ చెల్లించితీరాలని జవాబిచ్చారు. అయినా, రైతులు నిరుత్సాహపడక, పై మొత్తాన్ని కమిటీకి చెల్లించివేశారు. డిసెంబరు 26 వ తేదీని యీ సొమ్ముతో అధికారి వద్దకువెళ్ళి, యింతకంటె ఎక్కువ చెల్లించుకోజాలమని వివరాలతో తెలియజేశారు. అధికారి అంగీకరించక తప్పిందికాదు.

ఈ విధంగానే, నెమలి గ్రామస్థులు సమిష్టిగా రు. 4000 బాండ్సుకు సొమ్ము వసూలు చేసి చెల్లించారు.

తిరువూరుతాలూకాలో తాడిగూడెం కరణం వేరుసెనగ పంటపై పుట్టి 1 కి రు 3 చొప్పున యుద్ధబాండ్లు కొనవలసినదిగా రైతుల్ని బలవంతం చేశారు. రైతువర్కర్ల ప్రచార ఫలితంగా, రైతులు తమతమశక్తినిబట్టి రు. 200 వసూలు చేసుకున్నారు. అదివరకు రు. 2000 వసూలుచేయుటకు నిర్బంధింపజూచిన కరణంగారు, రైతులు యిష్టపూర్వకంగా యిస్తామన్న రు. 200 కు తన అంగీకారాన్ని తెలిపారు.

నూజివీడు తాలూకాలోని కొన్ని గ్రామాలలో, యకరం 1కి రు. 10 చొప్పున నిర్బంధపరచి రైతులవద్ద యుద్ధబాండ్లకు వసూలు చేస్తున్న తహసీల్దారు చర్యను ఖండిస్తూ, శక్తికొలది కొనవలసిందని రైతుల్ని హెచ్చరిస్తూ, 29-12-43 వ తేదీని తాలూకా రైతుసంఘం తీర్మానించింది.

విద్యార్థులపైకూడా యుద్ధబాండ్లే

యుద్ధబాండ్ల విషయంలో కొన్నిచోట్ల అధికారు లవలంబించే పద్ధతి శృతిమించి రాగాన పడుతోంది. గ్రామాలలో తండ్రుల వద్ద వసూలుచేసే సొమ్ముతో సంతృప్తిపడక, హైస్కూళ్ళకు వచ్చి, విద్యార్థులవద్దకూడా వసూళ్ల ప్రారంభించారు. విద్యార్థులు స్వయంగా ఏమీ సంపాదించుకొనేవారుకారు; తమ తండ్రులపై పూర్తిగా ఆధారపడి యుంటారు. ఒకేయింట్లో ఇద్దరూ-ముగ్గురూ విద్యార్థులుండడంకూడా కద్దు. వీరందరినీ బలవంతపెట్టి, యుద్ధబాండ్లకు డబ్బు వసూలు చేయడం ఎక్కడిన్యాయమో తెలియదు.

గుడివాడ హైస్కూలులో 22 వేల రూపాయల కోటాను విద్యార్థులు చెల్లించవలసినదిగా హెడ్మాస్టరు, మాస్టర్లు కలిసి నిర్బంధపరిచారు. ఇవ్వకపోతే, డిటెయిన్ చేస్తామనీ, పరీక్షలలో తప్పించుతామనీ బెదరించారు. ఈవిధంగా రు 7000 వసూలు చేశారు. మిగతా 15 వేల రూపాయల బాండ్లకు ఒక ధనవంతుడు 100 కి రు 98 చొప్పున యిచ్చి కొన్నాడు. మిగతా రు 2 ను విద్యార్థులు - ఉపాధ్యాయులు కలిసి పూర్తి చేశారు.

సొమ్ముతీసుకొని, టిక్కెట్లు యివ్వలేదు!

సత్తెనపల్లిలో మరొకసంఘటన జరిగింది. డిసెంబరు 15 వ తేదీని యుద్ధనిధి చందాకై ప్రదర్శించబడిన "విప్రనారాయణ" నాటకానికి తొండపి గ్రామ శివారైన రుద్రవరంలో ఫిర్కా రివెన్యూఇన్స్పెక్టరు టిక్కెట్ల చందా కింద రు 304 వసూలు చేసి, రు 126 లకు మాత్రమే టిక్కెట్లు యిచ్చాడు. ఇలాగే, తొండపిగ్రామంలో వసూలుచేసిన రు 351 లకు రు 138 మాత్రమే టిక్కెట్లు యిచ్చాడు. మిగతాసొమ్ము ఏమైనట్లు? యుద్ధనిధికి జమ కట్టబడినదా, లేదా? ఆసొమ్ముకు టిక్కెట్లు ఎందుకు యివ్వలేదు? మొదలైన వివరాలు కోరుతూ 6-12-43 న రుద్రవరం గ్రామస్థులు, 22-12-43 న తొండపి గ్రామస్థులు, జిల్లా కలెక్టరుకు మహజర్లు పంపుకున్నారు.

శక్తినిబట్టి వసూళ్లు

అనంతపురంతాలూకా పూలకుంట గ్రామానికి డిసెంబరు 12, 13 తేదీలందు ఒక వార్ ఫ్రంటు ప్రచారకుడువచ్చి, గ్రామం మొత్తం మీద రు. 500 యుద్ధబాండ్లను కొనవలసిందని ఒత్తిడితీసుకొచ్చాడు. వెంటనే స్థానికకమ్యూనిస్టులు రైతులందరినీ సమావేశపరచి, శక్తిగలవారంతా సొమ్ము యివ్వడం ఎలా మంచిదో బోధపరచగా, రు. 100 వసూలయాయి. గ్రామంయొక్క ఆర్థికపరిస్థితిని వార్ ఫ్రంటు ప్రచారకునికి వివరించి, రు. 100 కు అంగీకరించేటట్లు ఒప్పించారు.

ముస్లిం పండగల్లో విజ్ఞాన ప్రబోధం

★

కొత్తపట్టణంలో గుంటూరుజిల్లా పీర్లపండగ జరిగింది. ప్రతిఏడూ పీర్లపండగసందర్భంలో ఏవో వేషాలువేయడం, చూడవచ్చినవారిని చీపుర్లతోకొట్టడం జరుగుతూండేది. ఈసారి యువజనసంఘసభ్యులు, పార్టీసభ్యులు సానుభూతిపరులుకలిసి విచిత్రవేషాలువేసి విజ్ఞాన, రాజకీయ ప్రబోధం గావించారు. ఈ వేషాలు వేసినవారిలో షేక్ హైదర్ సాహెబ్ అనే 40 ఏళ్ళ వయోధికుడుకూడా ఉన్నారు. ఈ ప్రచారం ప్రజలను చాల ఆకర్షించింది.

తిరువూరు తాలూకా గంపలగూడెంలో కూడా మొన్న మొహరంపండగనాడు స్థానిక కమ్యూనిస్టులు ముస్లింబజారులో వివిధవేషాల ద్వారా ప్రచారం చేశారు. ముస్లిం స్త్రీలుకూడా వచ్చి ఈ ప్రచారం విన్నారు.

కార్మికులపై యజమానుల కొత్తదాడులు

●

అజంజాహిబట్టలమిల్లు(ఒరంగల్లులోనిది) కార్మికులు యూనియన్ స్థాపించుకున్న దగ్గర్నుంచి దీక్షతో అధికోత్పత్తి సాగిస్తున్నారు. చలికాలంలో బట్టలను అధికంగా ఉత్పత్తి చేయడం అంటే ప్రజలకు, సైనికులకు ఎంత మేలుచేయడమో వేరే చెప్పనక్కరలేదు. ఇలాంటికృషి జరుపుతూన్న కార్మికులపై అజంజాహిమిల్లు యజమానులు తెరపిలేకుండా దాడిచేస్తున్నారు. ఇప్పటి అధికధరలకు సరిపోయేలా జీతాలను హెచ్చించలేదు.

ఇంతేకాకుండా, యూనియన్ని విచ్ఛిన్నం చేయడానికి అన్నివిధాల ప్రయత్నిస్తున్నారు. యూనియన్ వర్కింగుకమిటీ సభ్యుడఖున సయ్యద్ కుంద్ మీర్ అనే కార్మికుడు యూనియన్ చందాలు, పనిలోనుంచి తొలగించబడ్డ వారికోసం బియ్యం, వసూలుచేయబోయాడు. అది యజమానులదృష్టిలో మహాపరాధమయింది. గతనెల 27 వ తేదీని అతన్ని పనిలోనుంచి తీసివేశారు. ఈ చర్యను కార్మికులు తీవ్రంగా నిరసించారు. ఈయన్ని తీసివేసినందుకు సంజాయిషీకోరారు — తమకు బోనసు ఇంకా ఎందుకివ్వలేదోకూడా అడిగారు. ఇలా అడుగుతున్న కార్మికులను పోలీసుల సహాయంతో బెదరగొట్టడానికి యజమానులు ప్రయత్నించారు. ఆ ప్రయత్నం సాగకపోయేసరికి, రెండురోజుల్లో జవాబుచెబుతామన్నారు.

ఇతర కార్మికులతరఫున ఆందోళన జరపనని హామీఇస్తే తిరిగి పనిలోకి తీసుకొంటామని సయ్యద్ కుంద్ మీర్ తో చెప్పారు. కార్మికులకు ద్రోహంచేసే అలాంటి హామీ ఎన్నటికీ ఇవ్వనని అతను నిరాకరించాడు. కార్మికులు కోరిన సంజాయిషీ యజమానులింతవరకుఇవ్వలేదు. పైగా మరికొంతమంది ముఖ్య కార్మికులను తీసివేయడానిక్కూడా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తూంది. ఈనెల నాలుగవ తేదీని ప్రభుత్వ లేబరుఆఫీసరు విచారణకువచ్చి, యజమానులతోమాత్రమే మాట్లాడి వెళ్ళిపోబోయాడు. కాని, కార్మికులు అతనిని ఆపి తమ ఇబ్బందులను వివరించారు. ఆయన ఆలోచిస్తానన్నాడు.

అధికోత్పత్తికి ఆటంకంకలిగిస్తున్న మిల్లు యజమానుల ప్రవర్తనను ప్రభుత్వం అరికట్టి, కార్మికుల కోరికలను వెంటనే నెరవేర్చాలి.

పంచదార మిల్లులలో

ఈ రోజుల్లో పంచదారొకటి అధికంగా ఉత్పత్తి కావలసిఉంది. కాని యీపరిశ్రమలో కూడా మిల్లుయజమానులు కార్మికుల అసంతృప్తిని రెచ్చగొట్టి, ఉత్పత్తికి భంగకరంగా ప్రవర్తిస్తున్నారు.

బొబ్బిలి (విశాఖజిల్లా)లో ఒకపంచదార మిల్లుఉంది. సుమారు పదిసంవత్సరాలనుంచి పనిచేస్తూంది. మిల్లు యజమానుల లాభాల సంగతి చెప్పనక్కరలేదు. అయినా కార్మికులకు చాల తక్కువ జీతాలిస్తున్నారు. అంతే కాదు. కొన్ని సంవత్సరాలనుంచి మిల్లు అధికారులు వెలమవారు. వీరు కులపక్షపాతంతో ప్రవర్తిస్తున్నారు. ఒకేపనికి వెలమవారికి ఎక్కువజీతాలివ్వడం - ఇతర కులాలవారికి అంతకన్నా ఎన్నోరెట్లుతక్కువ జీతాలివ్వడం సాగిస్తున్నారు. ఉద్యోగాలివ్వడంలో కూడాపూర్తియైనపక్షపాతమే. కార్మికుల్లో తీవ్రమైన అసంతృప్తి పెరగడమేకాకుండా, కార్మికుల్లో కులకక్షలు వ్యాపించడం కూడా జరుగుతూంది. ఈమధ్య ఉయ్యూరు పంచదారఫ్యాక్టరీ కార్మికులకుపోటీగాదొంగకార్మికులు కావలసివచ్చినప్పుడు బొబ్బిలి నుంచి వచ్చారు. దీనివల్ల అటు బొబ్బిలిలో ఉత్పత్తి పడిపోవడం, ఇటు ఉయ్యూరులో విషమపరిస్థితు లేర్పడడం జరుగుతుంది. ఈ పరిస్థితులను బొబ్బిలి మిల్లుయజమానులు గుర్తించాలి. కార్మికులలో అసంతృప్తి, ఆందోళన కలిగించే ప్రవర్తనను వదలిపెట్టాలి.

బొబ్బిలి కార్మికులు తమలోతాము కులభేదాలు లేకుండాఐక్యతకుదుర్చుకుని, సంఘంస్థాపించి, ఆ సంఘశక్తితో యజమానులను ఎదుర్కోవాలి. తమ హక్కులను సాధించాలి.

ఉయ్యూరు పంచదార ఫ్యాక్టరీలో యజమానులు కార్మికులను ఇబ్బందిపెట్టడం సాగిస్తూనే ఉన్నారు. కార్మికుల హక్కులకు భంగంకలిగించే షరతులతో బాండులు తయారుచేసి వాటిమీద సీజనల్ కార్మికులచేత సంతకాలు పెట్టించడానికి గతమాసం 24 వ తేదీని మళ్ళీ ప్రయత్నించారు, కార్మికులు నిరాకరించారు. దానికి ప్రతిక్రియగ రెండురోజులు పని చేయించుకొని, జీతాలివ్వకుండా వెళ్లగొట్టారు. కార్మికులను రెచ్చగొట్టి, పంచదార ఉత్పత్తికి భంగం కలిగించే ఇలాంటి ప్రవర్తనను ప్రభుత్వం సహిస్తూ ఊరుకోవడం శోచనీయంగా ఉంది.

గుంటూరు కుట్టుపనివారల యిబ్బందులు

అసోసియేటు ఏజన్సీవారు మిలిటరీదుస్తులు కుట్టించుటకు కంట్రాక్టుదారులు, గుంటూరు, తెనాలి, బెజవాడ, మొదలగు ముఖ్య పట్టణాల్లో వందలకొలది కుట్టుపనివారలచే పనిచేయించుకొంటారు. గుంటూరు కుట్టు పనివారలు కంట్రాక్టు దారులకు తమ యిబ్బందులగురించి తెలుపుకొంటే, పనిని ఆపేశారు.

దీనిమూలంగా కార్మికుల జీవనోపాధికి నష్టమే కాకుండా ఈ చలికాలంలో సైనికులకు కూడా చాల ఇబ్బంది కలిగించడమవుతుంది. తమ సొంత మెషీనులతోపనిచేసేటప్పుడు సూదులు ఉచితముగా సప్లయి చెయ్యాలని ఉంది. కాని సూదులు కంట్రాక్టర్లు అమ్ముతున్నారు. మిలిటరీ దుస్తులు కుట్టుటవల్ల మిషనుకు త్వరగా అరుగుదల కలుగుతుంది. అలాంటప్పుడు మిషన్లను బాగు చేయించే ఏర్పాట్లు చేయడములేదు. యజమానులకు చాల లాభాలు వస్తాయి కాని, పనివారలకు బోనసు లేదు. లాభములున్న చోట్ల బోనసు యివ్వాలన్న సూత్రము యుద్ధపరిశ్రమలన్నిటిలోను ఉంది.

బట్టలకిచ్చేరేటు సరిపోవుటలేదు. మిలిటరీ దుస్తులకు ప్రభుత్వం ఇస్తున్న రేటులో కంట్రాక్టర్లు మూడింట ఒకవంతు తమకుంచుకొని, మిగతాదానిలో రవాణా చార్జీలుకూడా పోగా మిగిలిందే కార్మికులకిస్తున్నారు. కార్మికునికివ్వవలసినదానిలో రవాణాచార్జీలు తగ్గించడం అక్రమము.

మిషన్లకు కల్తీ కొబ్బరినూనె యివ్వడము మూలంగా త్వరగా మిషనులు పాడవుతున్నవి. కొబ్బరినూనె యివ్వమంటే యింటికి తీసుకుపోతారని సాకు చెపుతున్నారు కంట్రాక్టర్లు.

రాత్రింబగళ్ళు పనిచేసేటప్పుడు దొడ్డి, నీటి సదుపాయాలులేవు. ఎక్కువ దుస్తులను తయారుచేయుటకు కుట్టుపనివారలు యజమానులతోగూడిన సలహా సంఘమును కోరితే యజమానులు త్రోసివేసారు. దేశరక్షణకు ఎక్కువదుస్తులుకావాలి. పనివారలహక్కులు గుర్తించాలి.

నూలుమిల్లు కార్మికుల ఆందోళన

రాజమండ్రిలో శ్రీ సత్యనారాయణ నూలుమిల్లుఉంది. కార్మికులచేత రోజుకి 14 గంటలు పనిచేయించుకుంటున్నారు. శనివారం రాత్రికూడా మిల్లు నడుపుతున్నారు. వారంలో ఏఒక్కరోజు పనికి రాకపోయినా వారం రోజుల యుద్ధఅలవెన్సు కోసేస్తున్నారు. ఈ ఇబ్బందులను తొలగించుకోడానికి కార్మికులు ఆందోళనచేస్తున్నారు. రోజుకు పదిగంటలు మాత్రమే పనిచేయించాలనీ, ఒకరోజు పనిలోకి రాకపోతే యుద్ధఅలవెన్సు తగ్గించకూడదనీ, శనివారంరాత్రి పని చేయించకూడదనీ, యుద్ధఅలవెన్సు హెచ్చించాలనీ, ఈమధ్య కార్మికుల జనరల్ బాడీసభలో తీర్మానించారు.

★ ★

అచ్చుపనివారల దినోత్సవాలు

ఆంధ్రరాష్ట్ర ప్రెడు యూనియన్ కౌన్సిలు ఇచ్చిన సందేశం ప్రకారం బెజవాడ, తెనాలి, రాజమండ్రి, నగరాల్లో అచ్చుపనివారల దినోత్సవం జరిగింది.

కామ్రేడ్, ఇవే మా జోహారులు

★ ★

కామ్రేడ్ చాగంటి కోటీశ్వరరావు ఏలూరు తాలూకా, సీతంపేట వాస్తవ్యుడు. 25 ఏళ్ళ యువకుడు; వైద్యుడు. మొదటినుంచీ చిత్తశుద్ధిగల జాతీయవాది, ప్రజాసేవకుడు. ఏడాదినుంచీ తాలూకా యువజనసంఘ సభ్యుడుగా ఉండి, సంఘ కార్యక్రమాన్ని దీక్షతో కొనసాగిస్తుండేవాడు. తరువాత పార్టీలోకివచ్చాడు. రైతుసంఘానికి ఎంతో తోడ్పడుతూండేవాడు.

ఇంతలో దేశంలో కరువు, అంటువ్యాధులు వ్యాపించాయి. లక్షలకొలది ప్రజల్ని పొట్టబెట్టుకోసాగాయి. మన కోటీశ్వరరావు మందులను సేకరించి ఆ ప్రాంతాలకు పంపడం ప్రారంభించాడు. విదివిరామం లేకుండా పల్లె పల్లెకు తిరిగాడు. ఈ తిరుగుడులో తానే వ్యాధిగ్రస్తు డయాడు. తీవ్రమయిన మలేరియాతో మంచంపట్టాడు. 20 రోజులు బాధపడి గత మాసం 29 వ తేదీని చనిపోయాడు.

ప్రజాసేవలో ప్రాణాలనువిడిచిన కామ్రేడ్, నీకివే మా జోహారులు.

విశాఖజిల్లా విద్యార్థి మహాసభ

★

విశాఖజిల్లా తృతీయ విద్యార్థి మహాసభ జనవరి 22, 23 తేదీలలో విజయనగరంలో జరుపుటకు నిశ్చయించారు. శ్రీ జి. రాధాకృష్ణమూర్తి B. A., B. L గారు అధ్యక్షులుగాను; శ్రీ కాట్రగడ్డ నారాయణరావు M.L.A గారు ప్రారంభకులుగాను ఆహ్వానింపబడ్డారు. విజ్ఞాన మహాసభకు శ్రీ కె. ఆర్. సుబ్రహ్మణ్యం M. A., P. H. D. గారు అధ్యక్షులుగాను, ఆంధ్ర అభ్యుదయరచయితల సంఘ కార్యదర్శి శ్రీ చదలవాడ పిచ్చయ్యగారు ఉపన్యాసకులుగానునిశ్చయింపబడింది. ఇంకా పలువురు ప్రముఖులు సభలో పాల్గొంటారు.

ప్రజాశక్తి ప్రచురణలు

★

వెలువడ్డాయి

గుండెనిబ్బరం	0—8—0
పశ్చాత్తాపం (నాటిక)	0—8—0

త్వరలో వెలువడనున్నాయి

పార్టీనిర్మాణ చరిత్ర

బాలసంఘం పాటలు

ప్రజాశక్తి చందావివరాలు

★

సంవత్సర చందా	5—0—0
అర్ధ సంవత్సర చందా	2—8—0
పావు సంవత్సర చందా	1—4—0

సవరణలు

★

గతసంచిక 'యుద్ధసమీక్ష'లో 3 వ కాలం నాలుగవపేరాలో 'గ్లసెస్టర్ అగ్రం గనుక రెడ్ఆర్మీ వశమయితే' అనుంది. 'అమెరికన్ సేనలు' అనడానికి బదులు 'రెడ్ఆర్మీ' అని పొరపాటుపడింది.

★

29-12-43 వ తేదీ "ప్రజాశక్తి" ఆఖరు పేజీలో "దేశభక్తులలో దేశపరిస్థితులే మార్పు తీసుకొస్తున్నాయి" అను వ్యాసం యదార్థ ఘటనకాదు; కథ. కామ్రేడ్ జి. వి. కొండయ్య దాన్నిరచించాడు.

కాగితం, సిరా కరువువల్ల ప్రెస్సులు ఆగిపోతున్నాయి. దీనివల్ల అచ్చుపనివారిలో నిరుద్యోగుల సంఖ్య పెరిగిపోతూంది. కాగితం, సిరా, సప్లయిపెంచి ప్రభుత్వం ఈస్థితిని తొలగించాలని కార్మికులు కోరారు. ప్రెస్ పనివారికి అసలే జీతాలు తక్కువకావడంవల్ల జీవనం గడవడం కష్టం. కాబట్టి యుద్ధ అలవెన్సు 8-8-0 కు పెంచాలని బెజవాడ సభలో కోరారు. సెలవులను గురించి, అధికారుల ఒత్తిడికి పాల్పడ్డ ఇతర కార్మికులపట్ల సానుభూతి, తీర్మానాలు చేశారు. యూనియన్లను గుర్తించే బిల్లునుగురించి సవరణలు సూచించారు.

మలేరియాతో ప్రజలు మాడిపోతూంటే వర్తకులు లాభసాటిబేరం సాగిస్తున్నారు

బెంగాల్‌లో భయంకర పరిస్థితులు

"బాబూ, మందిచ్చి మమ్మల్ని కాపాడండి! లేక పోతే మాలో ఒక్క ప్రాణి కూడా మిగలదు." ఫరీద్‌పూర్ బజారులో తన శరీరాన్ని గుడ్డ పేలికలతో కప్పుకుంటూ ఒక వృద్ధుడు కామ్రేడ్ నృపేన్‌రాయ్‌కి అందజేసిన ఆర్తనాదమది.

అక్కడికి కొద్ది మైళ్ళదూరంలో ఉందా వృద్ధుని పల్లె. 200 జాలరి కుటుంబాలకు నివాసమది. మలేరియావచ్చి వాటిలో యాభయ్యింటిని పొట్టబెట్టుకుంది. మిగతా 150 కుటుంబాల్లో 400 మంది ఉన్నారు. వీరిలో 67 గురు యువకులు, 27 గురు బాలబాలికలు, 11 మందియువతులు, 6 గురు వృద్ధులు మరి కొద్ది రోజుల్లోనే ఆ జాడ్యానికి బలి అయారు. యువకుడన్నవాడు వీధుల్లో కనబడడం అరుదయింది. చనిపోగా మిగిలిన వారిలో నూరింట 85 గురు మలేరియాతో మంచంపట్టారు.

ఇక నావృద్ధుడు, గుండె బేజారెత్తి ఆ ఆర్తనాదం చేయడంలో ఆశ్చర్యమేముంది? ఈనాడు బెంగాల్‌లోని వేలకొలది గ్రామాల్లో పరిస్థితులివే. పొట్టకు సంబంధించినరోగాలు, మలేరియా, మహామారుల్లా చెలరేగుతున్నాయి. గ్రామాలుగ్రామాలు నిర్మానుష్యమయిపోతున్నాయి. కొన్నిప్రాంతాల్లో పండి ఒరిగున్న పంటను కోయడానికయినా చాలినంత మంది లేరు.

ప్రతి జిల్లాలోను—

కలకత్తాలో కరువువచ్చి ప్రజల పటుత్వం పూర్తిగ క్షీణించింది. అలాంటివారిలో మలేరియా విజృంభించింది. కార్మికుల్లో మరీను. కడపలాలో నూరింట 60 మంది కార్మికులు మలేరియాతో పడిఉన్నారు. నార్కెల్‌డాంగాలో పనిచేసేవారులేక జూట్‌మిల్లు ఊరకనే పడిఉంది. డార్జిపారాలో మలేరియాలేని ఇల్లు లేదు. మొత్తంమీద కలకత్తాలో జాడ్యాలవల్ల, ఇతర కారణాలవల్ల డిసెంబరు నాలుగవతేదీ నాటికి ఒక వారంరోజుల్లో 1599 మంది చనిపోయారు. ఆ తరువాతవారంలో 1805 మంది చనిపోయారు. నిరుడు ఈ రెండువారాల్లో 690 మంది, 707 మంది మాత్రమే చనిపోయారు.

బీర్భూమ్‌జిల్లాలో ప్రతినెలా చనిపోయే వారిసంఖ్య 1519 నుంచి 5000 కు పెరిగింది. ఇందుకు మలేరియా, కలరాలే కారణమని జిల్లా హెల్తాఫీసరుచెప్పాడు. ఢాకాలో ప్రతి నెలా చనిపోయేవారి సంఖ్య జూన్‌లో 350, నవంబరులో 1555. జెస్సోగ్రాజిల్లాలోని 12½ లక్షల జనాభాలో నాలుగయిదు లక్షలమంది మలేరియాతో బాధపడుతున్నారు.

వ్యవసాయకూలీలుకరువయి, బారిసాల్‌లో ఆమన్‌పంట అంతా మట్టిగలిసేలాగుంది. ప్రతి జిల్లానుంచి ఇదే విషాదగాథ.

ఈ జాడ్యాలింకా ప్రారంభదశలోనే ఉన్నాయట. పరిస్థితులింకెంత భయంకర మవుతాయో? 1918 లో ఇన్‌ఫ్లూయంజా జాడ్యం వచ్చి ఒకకోటి 60 లక్షలమంది చనిపోయారు. ఈనాడుబెంగాల్‌లో చెలరేగుతున్న జాడ్యాలను ఇప్పట్లోనే అరికట్టకపోతే అవి దేశమంతటా వ్యాపిస్తాయి: 1918 కన్నా భయంకర పరిస్థితులేర్పడతాయి.

ఏదీ క్వినైన్?

అయితే ఈజాడ్యాన్ని అరికట్టడానికి క్వినైన్‌మా ఉేమిటి? క్వినైన్ ఇండియాలోనే పండుతుంది—కాబట్టి ఇండియాలో క్వినైన్‌కు కరువులేదని అమెరికా మన్స్ సభలో చాటాడు.

అసలు సంగతేమిటి?

యుద్ధానికి పూర్వం హిమాలయా ప్రాంతంలో 7 లక్షల పౌన్లు సింకోనాపండేది. సాధారణ సమయాల్లోనే దేశంలోనిమలేరియా రోగుల్లో పదోవంతుకు మాత్రం ఇదిసరిపోయేది. ఇప్పుడో? క్వినైన్‌దిగుమతులు కట్టిపోయాయి. పోనీ జాడ్యమయినా తగ్గిందా అంటే - అదిమహామారై విజృంభిస్తూంది. ఇకమనదేశంలోని సరుకు ఏంసరిపోతుంది? దీనికితోడు ఈ పరిస్థితుల్లోంచి అధికలాభాలు పండించాలనుకున్నారు వర్తకులు. ఉన్న సరుకునుకాస్తా బిగబట్టి ధరలు కొండంత పెంచారు. ఇదివరకు పౌను రు 37 అమ్ముతూండిన క్వినైన్ ధరఇప్పుడు 300 లేక 400 రూపాయిలకు పెరిగింది.

మలేరియా బాధలు భరించలేక, ప్రజలు క్వినైన్‌కోసం ఆక్రోశిస్తున్నారు. ఆమందు అంగడిలో మచ్చుకయినా కనబడడంలేదు. మందులేనిది ప్రజానేవకులు ఎంతకృషిచేస్తే మాత్రం ఏమిలాభం ఉంటుంది? ఈ మధ్య బెంగాల్ ప్రభుత్వం 4200 పౌనుల క్వినైను, పౌను 60 రూపాయిల చొప్పునఅమ్మడానికి మార్కెట్టులో పెట్టామన్నారు. రిజిష్టర్డు మందుల వర్తకులు దీనిని కూడా లంకించుకున్నారు. ఇదేకాక, స్థానికాధికారులద్వారా కూడా మందు ప్రజలకు అమ్మిస్తూందట ప్రభుత్వం. కాని అదిధనికులకే అందుతూంది గాని, ప్రజాసామాన్యానికి అందుబాటులోలేదు.

మరొక ఆశ్చర్యకరమయినవార్త. క్వినైన్ కరవయి వేలకొలది ప్రజలు చనిపోతూంటే, ప్రభుత్వపు కొట్లలో క్వినైన్‌మురిగిపోతూంది. మిద్నపూర్ స్థానికాధికారుల స్వాధీనంలో ఈ విధంగా 1000 పౌనుల క్వినైన్ ఉందట.

ప్రజల ప్రాణాలతో చెలగాటం

ఫరీద్‌పూరులో మలేరియా చాల తీవ్రంగా ఉంది. అక్కడి జిల్లా మేజిస్ట్రేటు తనదగ్గరుండిన 2000 పౌనుల క్వినైన్ని ప్రైవేటు డాక్టర్లద్వారా ప్రజలకు అందించడానికి ప్రయత్నించాడు. ఈ డాక్టర్లు ప్రజలకు మందివ్వడానికి బదులు దొంగమార్కెట్టుకి అమ్మి లాభాలు సంపాదించారు. ఇది తెలుసుకొని జిల్లామేజిస్ట్రేటు క్వినైన్ సప్లయి ఆపేశాడు.

ఈ పరిస్థితులనన్నిటిని పరిశీలిస్తే, తేలేదేమిటి? క్వినైన్ కరువయింది. సరిపడేటంత మందుప్రభుత్వంతెప్పించలేకపోయింది. ఉన్నస్టాకునయినా కట్టుదిట్టం చేయలేకపోయింది. వర్తకుల దొంగవ్యాపారాన్ని అరికట్టలేకపోయింది. స్థానికాధికారులద్వారా మందు సప్లయిచేయబోయింది. ఆఅధికారులు లాభసాటిబేరాలు సాగించి, ప్రజలనుజాడ్యాలకు బలిచేస్తున్నారు.

ఈ పరిస్థితుల నన్నిటిని అరికట్టాలనుకుంది ప్రభుత్వం. గతనెల 8 వ తేదీనుంచి వందలకొలది కొత్తవైద్యుల్ని, వేలకొలది శానిటరీఇన్‌స్పెక్టర్లను, నియమిస్తూంది. కొత్త హాస్పిటళ్ళను స్థాపిస్తూంది. కాని, వీటినన్నిటిని చేతకాని, అవినీతిపరులయిన, స్థానికాధికారుల చేతికింపనే ఉంచితే, ప్రజలకు ఆవంతయినా ప్రయోజనం ఉండదు. ప్రజల విశ్వాసాన్ని చూరగొన్న ప్రజాసంస్థలద్వారా సప్లయిచేస్తేనే క్వినైన్ ప్రజలకుఅందగలదు. ప్రభుత్వం ప్రజాసంస్థల సహకారంతో పనిచేస్తేనే మలేరియాను అరికట్టగలదు. మలేరియా నివారణ కమిటీలకు వెంటనే క్వినైన్ సప్లయిచేయాలి. వాటితోకలిసి పనిచేయవలసిందని స్థానికాధికారులందరికి ఉత్తరువులు పంపాలి. ప్రస్తుత భయంకర పరిస్థితుల్ని అరికట్టగల మార్గంఇదే.

(3వ పేజీ తరువాయి)ఫాసిస్టుల్నాగొలుసుతో బంధిస్తారు. ఈ పద్మవ్యూహంలో సామ్రాజ్యవాదుల కోరికలు భగ్నంకాకతప్పదు."

లోకంఅంతా కోటయ్యని చూస్తోంది. అందరూ యుద్ధంలో గెల్చుకోవాలని: కాని కోటయ్య పనికి వెళ్ళనని! చుట్ట మనిదులుపుకుంటూ గవరయ్య- "సెప్పరా నీయుద్దేశం." కోటయ్య కళ్ళింకా మండిపోతున్నాయ్!- "మోకాలినిప్పలు ఊడదీస్తాడంట యజమాని: అదేదో చూద్దాం" అన్నాడు.

"అంతసులువైనపనికాదోయ్ కోటయ్యా!" అని కామ్రేడ్.

"ఆయనసెప్పింది నాకూ నచ్చిందిరాకోటా! ఆలోసించాల! ఈ సారి తొందరపడకేసి! యజమాను లికేటికావాలా? అళ్ళొస్తే తలుపులు తీత్తారు ఆయన సెప్పినట్టు! అనుబవించేవోళ్ళం మనం."

ముసలమ్మ ముడతలుపడిన మొహంలో అనుభవాన్ని చెప్పింది:

"కూలీల్నిసూస్తే ఎవడికిరా ఇష్టం. పేదోళ్ళకి తప్ప? నేయం కావాలనోళ్ళకి తప్ప....కూలీలంతా సౌకెంగా వున్నారు కందా అని యజమాన్లు యుద్ధం నేయాలనిసూసినారు.... ఆయన సెప్పినయిధంగా నడుసుకోవాల!"

కామ్రేడ్ ఇలాచెప్పారు:

"పనిమానడం మన పనికాదు! పనిచేస్తూ గెలుచుకురావాలి. కూలీల రాజ్యాలొస్తాయని యజమానులంతా మనల్ని కత్తిరించడానికి పని చేస్తున్నారు. ఏకంగా ఓ మాటమీద నిలబడి, ప్రజలకి సైన్యానికి మనం సేవచేస్తూ యజమానుల అన్యాయాన్ని ఎదుర్కోవాలి. ఎంతవేగంగా కొడితే అంతలో రబ్బరు బంతి చిరుగుతుంది. మనం ఏకంకావడం వాళ్ళ పాపం బద్దలుకావడమన్నమాట! ఆదివారాలు కూడా మనం ఎందుకు పనిచేస్తున్నాం? గుడ్డల కరువురాకుండా. ఎందుకుయజమాని ఆటంకం? ఎక్కువ సరుకయితే చౌకఅవుతుంది గుడ్డ ఖరీదు. లాభాలకు దెబ్బ. కాని, మన పని ప్రజల్ని సమీకరించడం. ఇంటింటికిపోయి కోటా తయారుచేయడం....ఎవరికోసంఇస్తాడు కరువుభత్యం?.... మనది న్యాయం. కల్మషం లేదు. ఐక్యతవుంది. ఆందోళనచేసి వొత్తిడి ద్వారా గెలుద్దాం.... వూళ్లో ప్రజలందరి దగ్గరకిపోయి యజమానిమీదరాపిడితీసుకొస్తే.... సత్యం గెలుస్తుంది! మున్సిపల్ పనివాళ్ళ సంగతి! ఎలాతెచ్చుకున్నారు కోటయ్యా? ఆలోచించు! మీరంతా నిలబడండి. నేనున్నాను మీకు!"

ముసలమ్మముందుకి జరిగింది. గవరయ్య పక్కకి జరుగుతూ గొణిగాడు.

"ఆడికింకా అనుమానంపోలేదు! ఎవడికోసమిత్తాడు బత్తెం?"

ముసలమ్మ కోటయ్యచెవిలో—"ఆలోచన బాగుందాదిరా!"

"మోకాలినిప్ప లూడతీయిస్తాడంటగా: అదేదో తేలాలిముందు" అన్నాడు కోటయ్య.

"సులువుకాదురా!"

"ఏదో ఆడితలవిరుసు! పనిమానాల!"

"ఆడిమీద కోపంవచ్చి సీకొంపకి నువ్వే అగ్గిపెడతావంటరా?"

సందుతిరిగి చూరు రాసుకుంటూ ఎవరది? కాకీడ్రస్సు....ఎవరో ముసలమ్మ పేరుతో పిలుస్తున్నారు: కామ్రేడ్, ఆత్రంగా చూస్తూన్న కూలీలకి ధైర్యంచెపుతూ, "ఇలా రావచ్చు" అని కేకేశాడు. పోస్టు బంట్రోతువచ్చాడు.

"ఉత్తరం!"

"ఎక్కణ్ణుంచి బాబా!"

"నీ కొడుకు దగ్గిర్నుంచి!"

"సదివిపెట్టరూ?"

కొడుకు కులాసాగావున్నాట్ట! అంతా బాగా వుందిట. "కోటయ్యబావకిదణ్ణాలు, ఆవకాయి తినాల్నుంది....చలిగావుంది.... ఏమైనా బట్ట బంతేఆసైడ్‌వితొడుక్కోవాలని! రాత్రుళ్లు... పుట్టినోజుకి పండుగ! క్రాస్ బహుమతీ ఇచ్చారు.... గూడెంలో పెద్దల్నీ పిన్నల్నీ అడిగానని చెప్పవలెను.... పాపాయమ్మకు ముద్దులు!"

"నా కూతురుకి ముద్దులా?"

"అవున్రా కోటయ్యా! ఆడికెంతభిమానం మనమంటే.... ఏటి పంపించాలే?"

"ఆవకాయ తినాల్నుందంట.... పుట్టినరోజుకి ఈసైడ్‌బట్టలు కట్టుకోవాల్నుందంట."

"కోటయ్యా.... బట్టలెలాగరా?"

"ఎలాగేటి? తలోపావలా ఏసుకుందాం!"

"అవకాయి పంతులమ్మనిఅడుగుతాన్లేరా."

"గవరయ్యా, కొనివంపించవూ?"

"కోటయ్యా! నా కొడుకుల్లాంటి కొడుకులంతా పటాలంలో వున్నారూ?"

"ఉన్నారు."

"మనం ఆళ్ళ కిక్కడుండి సదుపాయం సెయ్యాలా, వద్దా?"

"సెయ్యాలి."

"అయితే సమ్మెందుకురా? సమ్మెచేస్తే సైన్యానికి బట్టలో?"

కోటయ్య మాటాడలేదు.

"నేనంటున్నానుకదరా కోటా! నామీద రోషంనీకు!" అన్నాడు గవరయ్య.

"సమ్మెలేదు — గిమ్మెలేదు. పదండిరా, కిట్టప్పకి బట్టుకొందాం!"

* * * *

రైలుబద్దీల ఇవతలఊళ్లో వూరేగింపుఅలజడి....ఆందోళనా....అట్టిపట్టుకుని గవరయ్యనించున్నాడు. జెండాతో కోటయ్య ముందు దూసుకుంటూ తోసుకుపోతూ — గెలుపుకి! కరువుభత్యం కావాలని! ఫాసిజం పోవాలని! నినాదాలూ, తీర్మానాలు! కోటయ్య గూడెంనుంచి మిల్లుముందు నడుచుకుపోతున్నాడు. ఛాతీ విరుచుకుని నడుచుకుపోతూంటే, మిల్లుముందు యజమాని నించున్నాడు....నరాలను కొరికే చలిలో....జంకూ గొంకూ లేక కోటయ్య ఇటే వస్తున్నాడు. అది గదిగో పక్కని గవిరయ్య .... మధ్య ఎవరదీ? కామ్రేడ్....వెనకాల కూలీలు....కరువుభత్యం కావాలని పన్నెండేళ్ళ పనివాడు అరిచాడు. అంతా ఆదేఅరుపు ఆకాశం విరిగేలాగ! .... పనిచేసితీరుతామని....అధికలాభాలు పోవాలని.. ఏం అరుపులు! మిల్లులోకి పనివాళ్ళంతా వెడుతూంటే!

ఛాతీవిరుచుకుని కోటయ్య మిల్లు గేటులోంచి దూసుకుపోతూంటే, అదిరిపడి చూస్తాడా యజమాని!........ఆగిన గడియారంలా వుండటాని చూస్తు!

★ యుద్ధ సమీక్ష

నీపరు మలుపులో 5 లక్షల నాజీలకు అవసానదశ

— తుమ్మల వెంకట రామయ్య

రెడ్‌ఆర్మీ విజయపరంపరలను సాధించుతోంది. ఒక్కొక్క కీలకస్థానాన్ని పట్టుకోడంతో జర్మను ఫాసిస్టుమూకల గుండెలలో ఒక్కొక బాకుపోటు పొడుస్తోంది. ఉప్పెన కెరటాల్లా వచ్చిపడే రెడ్‌ఆర్మీ సైన్యాల ముందు నాజీలు వేలకువేలు మరణించుతూ, గాయపడుతూ, బందీలవుతూ, హతమారుతున్నారు.

కొరోస్టెన్ వశపరచుకొన్న సోవియటు సైన్యాలు నొవోగ్రాడ్ వొలిన్స్, ఓలెవ్స్కలను పట్టుకొని ముందుకు పోయాయి. పశ్చిమ యుక్రెయిన్‌లో పాదంపెట్టాయి. 1939 సరిహద్దు కవతల నున్న సార్నీని సమీపించుతున్నాయి.

మరియొక వైపు రెడ్‌ఆర్మీ అతిప్రాముఖ్య విజయాలను సాధించింది. బెర్డిచావ్, బెలాయా సెర్కావ్‌లను వశపరచుకొంది. ఇవి రెండూ ముఖ్యకీలక స్థానాలు. బెర్డిచావ్ జిటోమీర్‌కు దక్షిణంగా, పోలండుకువెళ్ళే రైల్వే లైనులో వుంది. బెలాయాసెర్కావ్ వశమవడంతో నీపరు మలుపుకువెళ్ళే రైలుమార్గంలో ఒక ముఖ్యస్థానం వశమైంది. బెర్డిచావ్, బెలాయా సెర్కావ్‌లను కలిపే రైలు జంక్షన్ కజాటిన్ ఇదివరకే రెడ్‌ఆర్మీ వశమయింది. బుగ్‌నదీ తీరాన, కజాటిన్‌కు దక్షిణాన ఉన్న వినిట్సా అనే పట్టణంవైపుకు రెడ్‌ఆర్మీ పోతోంది. అప్పుడే వినిట్సాకు ఆగ్నేయంగా ఉన్న "ఇలిన్సీ" కూడ వశమయింది. ఇది కూడ మంచికూడలి స్థానం. ఆరు రోడ్ల మార్గాలకు కూడలి ఇది. పైగా బుగ్‌నది సమీపంలో ఒడెస్సా - బెర్లిన్ రైలు మార్గం మీద ఉన్న జ్మెరింకాతో ఇది కలుస్తుంది. త్వరలోనే, వినిట్సా, జ్మెరింకాలను రెడ్‌ఆర్మీ వశపరచుకుంటుందని ఊహించ వచ్చు. జ్మెరింకా వశమవడంఅంటే, ఒడెస్సావిముక్తి సమీపించడం అన్నమాట.

బెలాయాసెర్కావ్ మాత్రమేగాక, కిరోవ్‌గ్రాడ్‌కూడ రెడ్‌ఆర్మీ వశమవడంతో, నాజీల పని కుడితిలోపడ్డ ఎలుకలగతి అయింది. నీపర్‌మలుపులోనిపలక్షలసైన్యాలకుసహాయం లేకుండా పోయింది. జర్మన్లకు ఇక మార్గం నికోలెయేవ్‌మీదుగా ఒడెస్సాగుండా రుమేనియాలోకి పోవడమే. కాని ఛిన్నాభిన్నమైపోతున్న నాజీసేనలకు ఈ అవకాశంకూడా లభించనీయదు రెడ్‌ఆర్మీ. అప్పుడే కిరోవ్‌గ్రాడ్‌కు ఆగ్నేయంగా 70 మైళ్ళ రంగంలో చొచ్చుకుపోయింది రెడ్‌ఆర్మీ. ఏక్షణాన్నైనా మంచు గడ్డకట్టడం ప్రారంభంకాగానే, ఖెర్సన్ నుండికూడా రెడ్‌ఆర్మీ నీపర్‌నది దాటి నికోలోయెవ్ పని పట్టించవచ్చు. అందుచే నీపరుమలుపులోని జర్మనుసైన్యాలకు అవసానదశ వచ్చినట్లే.

సోవియటు విజయాలు హిట్లరు ముఠాకేగాక, అతని తొత్తులకు గూడ గాభరాపెడుతున్నాయి. అలాంటి వాళ్ళల్లో ఫ్రాంకో వొకడు. స్పెయిన్ "తటస్థంగా" ఉన్నానంటూ ప్రకటించింది. కాని సోవియటుకు స్పానిష్ ఫాసిస్టు సైన్యాన్ని (బ్లూ డివిజన్) పంపించింది. స్పెయిన్ యుద్ధ ఫ్యాక్టరీలన్నీ హిట్లరుచేతిలో పెట్టింది. 'తటస్థత' అనే పేరుతో మిత్రరాజ్యాల ద్వారా సంపాదించే సామగ్రిని జర్మనీకి సప్లయిచేస్తోంది. ఇదంతా చూచి కూడా స్పెయిన్‌పట్ల ఉదారభావం చూపుతోంది బ్రిటిష్ అభివృద్ధి నిరోధక ముఠా. ఎందువల్ల? మ్యూనిక్ ముఠాకు చెందిన ఫాసిస్టు అనుకూలుడగు శామ్యూల్ హోర్, ఇంకా బ్రిటన్ తరఫున, స్పానిష్ రాయబారిగా ఉండటమే.

స్పెయిన్ యీమధ్య సోవియట్ రంగంలోని స్పానిష్ సైనికులను తిరిగి రప్పించినట్లు ప్రకటించింది. ఇది పట్టిఅబద్ధం. ఫెలాంగిస్టు (ఫాసిస్టు)పార్టీని రద్దుచేసినట్లు కూడ ప్రకటించింది. ఎందుకిదంతా? జర్మనీ ఓటమితప్పదని. దానితో తమగతీ అంతేనని ఫ్రాంకో ముఠాకు తెలుసు. కాని, ఈలోగా ఇలాంటి చిన్నచిన్న పనులద్వారా, (అంటే నామకః ఫెలాంగిస్టులను రద్దుచేయడం) హోరులాంటి అభివృద్ధి నిరోధకుల సహాయం పొందవచ్చు తద్వారా ఎలాగో నిలబడవచ్చు. ఇదీ ఫ్రాంకో ముఠాకల.

కాని, విద్రోహి ఫ్రాంకో గతిని, స్పెయిన్ భవితవ్యాన్ని నిర్ణయించేది హోర్ - హాలిఫాక్సులుగాదు. ఫాసిస్టు దాస్యవిముక్తి పొందిన యూరప్ ప్రజలూ, తదితర ప్రపంచ ప్రజలే నిర్ణయిస్తారు.



ఇట్టి సమయంలో ప్రవాసంలోనున్న వివిధ పక్షాల స్పానిష్ ప్రజాస్వామ్య నాయకులంతా కలిసి స్వతంత్ర స్పానిష్ కమిటీ నొకటి అమెరికాలో పెట్టబోతున్నారన్న వార్తసంతోషించదగిన విషయం.

హిట్లరు ఓటమిఖాయమే. కాని హిట్లరును ఓడించడానికి చేయవలసినదింకా చాలావుంది. కాని ఆవిషయం వదలివేసి అప్పుడే "సరిహద్దుల" సమస్యను కొందరులేవదీస్తున్నారు. సోవియటు వ్యతిరేక ప్రచారం ప్రారంభించుతున్నారు.

అమెరికాలోని కొందరు పెట్టుబడిదారులు అక్షరాజ్య అనుకూలురు. వారు ఉత్పత్తి హెచ్చుగాకుండా, కార్మికులను రెచ్చగొట్టి సమ్మెలు చేయించుతున్నారు. అలాంటి అభివృద్ధి నిరోధకముఠా అమెరికా శాసనసభ్యులలో చాలామంది ఉన్నారు. అందులో ఒకడైన జాన్సన్ "ప్రపంచాన్నంతా రష్యా, బ్రిటన్, చైనాలు పంచుకొంటాయని అన్నాడు. సోవియటుపై ఈ నిందవేయడం ఇదికొత్తదిగాదు. సోవియటు, యుద్ధానంతరం కోరేది ప్రజలు తమ ఇష్టంవచ్చినట్లు నిర్ణయించుకొనే ప్రజాస్వామ్య ప్రభుత్వం, అంతేగాని ప్రపంచాన్ని పంచుకోడంకాదు. ఈసంగతి జాన్సన్ లాంటి వాళ్ళకు తెలియకకాదు. కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు.

ఇన్నాళ్లూ, సోవియటు అంటే ఎన్నో మొసలి కన్నీళ్ళు కార్చిన విల్కీ అసలు రంగు బయటపడింది. పోలండు బాల్టిక్ సరిహద్దులసంగతి ఎత్తితే, ప్రవదా చక్కగా అతనిని చీవాట్లు పెట్టింది. ప్రవదా ఇలా వ్రాసింది. "బాల్టిక్ సమస్య అనేది మా అంతరంగిక విషయం. దానిలో విల్కీ సహాయం అక్కరలేదు. సోవియటు శాసనం విల్కీబోటివాళ్ళు ఒకసారి చూడవచ్చు. ప్రజాస్వామ్య నిర్ణయం ప్రకారమే ఆబాల్టిక్ రాజ్యాలు సోవియటుతో కలిశాయి. పోలెండు ఫిన్లండు విషయాలలో కూడ, వాటితో ఎలా మెలగాలో సోవియటుకు తెలుసు. రెడ్‌ఆర్మీ యొక్క, మిత్రరాజ్యాలయొక్క విజయాలను చూచి ఆక్రందించే అభివృద్ధి నిరోధకముఠాల అభిప్రాయాలనే విల్కీకూడా వెలిబుచ్చుతున్నాడు."

సోవియటు సైన్యాలు పశ్చిమయుక్రెయిన్‌లో ప్రవేశించగానే లండనులోని పోలిష్‌ప్రభుత్వం కొన్ని ప్రకటనలను గావించింది. పోలిష్ సరిహద్దులలోకి రెడ్‌ఆర్మీ ప్రవేశించుతోందనీ, పోలిష్ ప్రభుత్వహక్కులను సోవియటు గౌరవించాలనీ, తాము అక్టోబరులో పోలండులోని రహస్యఉద్యమానికి సోవియటు సైన్యాలువచ్చే పక్షంలో వాటితో తగాదాలేకుండా సహాయపడమని చెప్పామనీ, ఈ ప్రకటన సారాంశం.

1939 నాటి సరిహద్దులు న్యాయమైనవేనా? కావు. 1919 లో సోవియటు బాల్యావస్థలో నున్నపుడు కాజేసినభాగాన్నే ఇపుడు "పోలిష్‌దేశం" అంటూ బాకాలూదుతున్నారు.

అమెరికాలోని సోవియటురాయబారి చెప్పినటుల "ఈ ప్రదేశాన్ని రెడ్ ఆర్మీ 1939 లో హిట్లరు వాతబడకుండా కాపాడింది. పోలిష్ దురాక్రమణదారుల క్రింద బానిసత్వాన్ని, రెడ్‌ఆర్మీ, పశ్చిమ యుక్రెయిన్‌కు బైలోరష్యాకు తప్పించింది. ఈ భాగాల ప్రజలు తమ ప్రభుత్వవిధానాన్ని నిర్ణయించుకొని సోవియటుతో కలిశారు. అట్టి ప్రదేశాన్ని తిరిగి రెడ్‌ఆర్మీ నాజీలచెరనుండి తప్పించుతోంది."

పోలిష్ రహస్య ఉద్యమానికి, సోవియటు సైన్యాలతో సహకారం చేయండని చెప్పినట్లు లండన్‌లోని పోలిష్ "ప్రభుత్వం" చెబుతోంది. ఇది నిజమేనా? కాదని దీని పూర్వచరిత్రే చెబుతోంది. యుద్ధ మేఘాలు తనదేశంపై కమ్మినరోజులలోగూడ, రెడ్‌ఆర్మీ తనకు సహాయార్థంగా వస్తానన్నా, వద్దన్నది ఈ ప్రభుత్వమే. పోనీ హిట్లరు ఆక్రమణతో బుద్ధివచ్చిందంటే అదీలేదు. (పోలండు - సోవియటుతోటి ఒడంబడికను ఎలా భగ్నం చేసిందీ సంపాదకీయంలో వివరించాం.) పోలిష్ ప్రధాని జనరల్ సికోర్స్కి ప్రమాదం వలన చనిపోయాక అతనిస్థానే జనరల్ సోస్‌కోవిస్కీని నియమించింది. ఎవరితడు? సోవియట్‌తో జనరల్ సికోర్స్కి సంధిచేసికొన్నాడని తాను మంత్రివర్గంనుండి రాజీనామా పెట్టాడు. ఇతడు సోవియటు వ్యతిరేకి, నాజీ అనుకూలుడు. అట్టివాడే సికోర్స్కి స్థానం తీసుకొన్నాడు.

ఇతని ఆధ్వర్యానే, పోలండ్‌లో జనరల్ మిహిలోవిచ్ (యూగొస్లావియాద్రోహి) ఉద్యమంలాంటి ఒక గెరిల్లా ఉద్యమం నెలకొల్పబడింది. వీరు, పోరాడేది ఎవరితో? నాజీలతోకాదు. నిజమైన పోలిష్ దేశభక్తులతో, సోవియటుతో స్నేహం కావాలనేవారితో.

ఈ విషయానికి నిదర్శనం, లండన్‌లోని పోలిష్‌మిలటరీ పత్రికయే. గత అక్టోబరులో అదిఇలావ్రాసింది. "రెడ్‌ఆర్మీ పోలండులో ప్రవేశించినపుడు, పోరాటంతప్పదు. ఎలాంటి ఫలితాలు సంభవించినా సరే." గత అక్టోబరు చివర వారంలో, "వార్ అండ్ వర్కింగు క్లాసు" కూడ ఈ విషయాన్నే బయటపెట్టింది. "పోలండులో రెండు రహస్య ఉద్యమాలు పనిచేస్తున్నాయి. ఒకటి సోవియటుతో స్నేహాన్నివాంఛిస్తోంది. రెండవది పోలిష్ ప్రభుత్వం తరపున ఏర్పడింది. ఇందులో మొదటిది రెడ్‌ఆర్మీ రాగానే వారితో సహకారం చేస్తుంది. రెండవది ముందుకు వస్తున్న రెడ్‌ఆర్మీని ఎదిరించుతుంది." ఇది అందరికీ తెలిసినవిషయమైనపుడు, పోలిష్ ప్రభుత్వం తాము "సహకారం" చేయండని తమ అనుచరులకు ఆజ్ఞాపించారంటే నమ్మేదెవరు?

లండన్‌లోని ఈ అనామక, అభివృద్ధి నిరోధక ప్రభుత్వం ఎంత త్వరగా వదిలిపోతే మిత్రరాజ్యాలకు అంతమంచిది. నిజమైన పోలిష్‌దేశభక్తులంతా అందుకే కృషిచేస్తున్నారు. విజయం వారిదే.

10—1—44

(2 వ పేజీ తరువాయి) 1000 మందికంటె తక్కువ కూలీలున్నట్లు కన్పరుస్తున్నారు:

ఈవిధంగా, నిలవ వ్యాపారస్తులు యే ఆటంకాన్నీ లెక్కచేయడం లేదు. బెంగాల్ మంత్రివర్గం విరివిగా సరుకును కొనే విధానమవలంబించక, దొంగవ్యాపారస్తులకు లొంగిపోవడంవల్ల, ఆహారకమిటీల సహకారం తీసుకోకపోవడంవల్ల సంభవిస్తూన్నఅనర్థాలు, యివన్నీ.

ఉచిత భోజనశాలలకు స్వస్తి

మరొకవైపున బెంగాల్‌ప్రభుత్వం నౌఖాలి, మిద్నపూర్, ఢక్కాజిల్లాలలో ఉచిత భోజనశాలల నెత్తివేస్తున్నారు. ప్రభుత్వం ఇందుకు చూపే కారణాలేమిటి? కొత్తపంట పుష్కలంగా పండింది; అందువల్ల యీపేదజనాన్కి వారివారి గ్రామాలలో కావలసినంత తిండి లభిస్తుంది!

కాని, అసలు పరిస్థితు లెలా ఉన్నాయో చూదాం. నౌఖాలిజిల్లాలో 1½ లక్షలమందికి ఉచితభోజనశాలలలో తిండి లభిస్తూఉండేది. వీరిలో అనేకమంది రైతులు తమ భూముల్ని అమ్మివేసుకున్నవారు. వీరుగాక, చేనేత పారిశ్రామికులు, పడవలవారు, చేపలుపట్టేవారు, తమతమ సాధనాలన్నింటినీ అమ్మివేసుకున్నారు. ఇక ఢక్కా జిల్లాలో 3 లక్షలమంది ఆకలివల్ల చనిపోయారు. మరో 3 లక్షలమంది యితర జిల్లాలకు వలసపోయారు. మిగతా జనాభాలో సగంమంది కలరా, మశూచి మలేరియా, మొదలైన జాడ్యాలతో బాధపడుతున్నారు. షుమారు 10 లక్షల మందికి ఏ విధమైన జీవనాధారం లేదు. రైతులు తమ భూముల్ని, పశువుల్ని, అమ్మివేసుకున్నారు. చేనేత పారిశ్రామికులు మగ్గాలు అమ్మివేసుకున్నారు. పల్లెవాండ్రు వలలన్నీ అమ్మివేసుకున్నారు. పడవవారు పడవ లమ్మివేసుకున్నారు. ఈపరిస్థితుల్లో ఉచిత భోజనశాలల నెత్తివేయడం గర్హించవలసిన విషయం.

శ్రీవాత్సవ విజ్ఞప్తి

ఈ విధంగా బెంగాల్‌లో తిరిగి విషమ పరిస్థితు లొచ్చే సూచనలు కన్పిస్తూంటే స్వాతంత్ర్య ప్రియులవలంబించవలసినమార్గం ఏమిటి? బాధ్యత అంతా ప్రభుత్వానిదేకదా! అని చేతులు ముడుచుకొని కూర్చోవడం దేశభక్తి ఎన్నటికీకాదు. ప్రజా సామాన్యాన్ని ఎదుర్కొనే భీషణ సమస్యలకు పరిష్కార మార్గం చూపాలి. సత్యాగ్రహంచేసి జైళ్ళకు పోవడం బాధ్యతను తప్పించుకోవడమే గాని ఆకలిమంటలకు పరిష్కార మార్గం కాదు. ఆరోజున కాంగ్రెసు వాదులు దేశీయుల కందజేయవలసిన సందేశమేమిటి? శ్రీ గోపీనాధ శ్రీవాస్తవ నుడివినట్లు, జైళ్ళబయట ఉన్న ప్రతి కాంగ్రెసువాది నిరుత్సాహాన్ని, నిస్సహాయతను, విడిచిపెట్టాలి. కాంగ్రెసు సంస్థయందలి ఐక్యతను కాపాడాలి. ప్రజలకు తిండి, గుడ్డ లభించేటట్లు చేయడానికి నిర్మాణయుక్తంగా పనిచేయాలి. సంపూర్ణ స్వాతంత్ర్య సాధనకు యీ కార్యక్రమం ఎంతైనా తోడ్పడుతుంది. కాబట్టి స్వాతంత్ర్య దినోత్సవంనాడు యీ కార్యక్రమాన్ని స్వీకరించడం ఉచితం."

★ బాల బాలికలకు ★

మీసంఘం సభ్యులు తమకుతలకు మించిన పని అనికూడా వెరవకుండా, మంచిమంచిపనులకుపూనుకొంటున్నారు. కర్నూలు జిల్లాలో కురుకుంద అనే గ్రామంవుంది. ఆ వూళ్లో గ్రంథాలయం పెట్టదలచారు. విరాళాలిచ్చేవారి పట్టీ తయారుచేశారు. గ్రామస్థులు 50 రూపాయల విరాళాలను వాగ్దానం చేశారు. అందులో 26 రూపాయలదాకా వసూలుచేశారుకూడా. ఇంతేగాదు 50 పుస్తకాలను వసూలుచేశారు. గ్రామానికి మధ్యగా, అందరికీ అందుబాటులోవుండేటట్లు, ఒక ఇంటిని గ్రంథాలయానికి తీసుకొన్నారు.

గ్రంథాలయం అన్న తర్వాత పత్రిక లేకపోతే ఎలా? "ప్రజాశక్తి" తెప్పించుదామనుకొన్నారు. ఒకరోజున మిరపమొక్కలునాటి, ఒకరూపాయి సంపాదించారు. సభ్యులంతా రెండురూపాయలు తమవంతు వేసుకొన్నారు. మరొకరివద్ద 2 రూపాయల విరాళం ప్రోగుచేసి, చందా గట్టారు. దీక్ష అంటే అలావుండాలి.

ఇంతేగాదు. ఇతర ప్రజాసంఘాలకు తోడ్పడుతున్నారు బాలసంఘ సభ్యులు. తూర్పుగోదావరిజిల్లా పామర్రు బాలసంఘం, రైతుసంఘ సభ్యులను చేర్పించుటలో సహాయపడ్డారు. స్వయంగా తాము 25 మంది రైతుసంఘ సభ్యులను చేర్పించారు. తీరికసమయాల్లో ఇలాంటి పనులు చేస్తుంటే, బాలసంఘాన్ని అన్ని ప్రజాసంఘాలు ఆదరించి ఆదుకొంటాయి.

కొన్నికొన్నిచోట్ల బాలసంఘాలు తమ ఆరోగ్యం విషయంలోను, ఇతరుల ఆరోగ్యం విషయంలోను, చేసే కృషి చాలా మెచ్చుకోతగింది.

నెల్లూరులో తోటీపాలెంలో, తోటీ (పాకీ) పనివాళ్ళ బాలసంఘం వుంది. బాలసంఘం ఏర్పడిననాటినుండీ వీరిలో పరిశుభ్రత హెచ్చింది. రోజూస్నానంచేయడం మొదలెట్టారు. ఇదివరకు స్నానంచేయడం చాలా అరుదు. పొగాకు నమలడం మానేశారు. చిక్కిరి బిక్కిరిగా ఉండేజుట్టు ఇపుడు మాయమయింది. క్రాపులు చేయించుకొన్నారు. ఇంతేగాక తమ పెద్దలలో, కల్లు తాగవద్దనీ, పేకాట ఆడవద్దనీ, ప్రచారం చేస్తున్నారు. రాజంపేటలోగూడ ఇలాగే గత నవంబరులో కలరా నివారణ పద్ధతులను అట్టలపైవ్రాసి బాలసంఘం ఊరేగింపు జరిపింది.

నెల్లూరుజిల్లా ఆత్మకూరులో, చుట్టుప్రక్కల కలరా వుండటంవల్ల, రైతుసంఘం కోరికపై హెల్తుఇన్‌స్పెక్టరు టీకాలువేయ ప్రారంభించాడు. పిల్లలంతా భయపడి వేయించుకోకపోతే, కృష్ణవేణి అనే బాలిక ముందు తాను వేయించుకొంది. తర్వాత అందరికీ నచ్చజెప్పి, తీసుకవచ్చి టీకాలు వేయించింది.

కిరోసిన్ లేకపోవడంవల్ల బాధపడేది పెద్దవాళ్లేగాదు. పిల్లల చదువుసంధ్యలకు కూడా ఇబ్బంది అవుతుంది. రాత్రిళ్లు పాఠాలు చదవాలి. చదవకపోతే మాస్టరు మరుచటి రోజు కొడతాడు. చదవాలంటే కిరోసిన్ సరిగా దొరకడంలేదు. పొన్నెకల్లు (గుంటూరు జిల్లా) లో కోపరేటివ్‌స్టోర్సుకు కిరోసిన్ ఇవ్వకపోవడంవల్ల, పంపకం సరిగా జరగడంలేదు. ఇచ్చిన కిరోసిన్ కూడా గ్రామానికి సరిపోవటంలేదు. అందుచే ఆగ్రామ బాలసంఘం 29—12—43 న సమావేశమై, కోపరేటివ్‌స్టోర్సుకే కిరోసిన్ పంపకం ఇయ్యాలని, కిరోసిన్ కోటా హెచ్చించాలని, కోరుతూ ఒక తీర్మానంచేసి జిల్లాకలెక్టరుకు పంపారు. అమృతలూరు బాలసంఘంకూడా కిరోసిన్ సప్లయి చేయాల్సిందని ఒక తీర్మానం చేసింది.

* * *

మీకీ పత్రిక చేరేసరికి మీరు సంక్రాంతిపండుగ వేడుకలలో మునిగివుంటారు. సంక్రాంతి ప్రాముఖ్యత ఏమిటో తెలుసా? ఈ పండుగకు బీదాబిక్కీ అనే భేదం లేక సామాన్యంగా అందరికీ చేతిలో డబ్బులూ, ఇంట్లో గింజలూ మెదలుతూవుంటాయి. కార్తీకమార్గశిర మాసాల్లో, తిండిలేక పనులులేక బాధపడే బీదజనం, కోతలు ప్రారంభమయి కుప్పలునూర్చడం ప్రారంభించేసరికి, కూలీ చేసుకోవడంవల్ల కొంత ధాన్యం సంపాదించ గలుగుతారు. కొంతమందికి ఈ వచ్చినదంతా పాత అప్పులకు సరిపోయేమాట నిజమే. అయినా, కనీసం అప్పుగానైనా గింజలు దొరికేరోజులివి. అందుచేత ముందుసంగతి అలావుంచి, తాత్కాలికంగా నైనా మైమరచి పోదామని కొన్ని దురలవాట్లకు లోనవుతారు. అవి కోడిపందాలు వేయడం, త్రాగడం. వీటిల్లో ఒక్క బీదకూలీలే గాకుండా, రైతులు పాల్గొనడంకూడా వుంది. ఆ పందేలు చూడడానికివెళ్ళి, జూదంలో పిల్లలుకూడా డబ్బులు ఖర్చుపెడతారు. ఇలాంటి దురభ్యాసాలను మాన్పించడానికి గ్రామాలలో మన యువజనసంఘాలు కృషిచేస్తున్నాయి. మీరు వారికి తోడ్పడండి. ఆటలు, పాటలు, నాటకాలద్వారా ప్రజల్ని ఆకర్షించి, ఆ పందేలవైపుకు పోనీయకుండా చేయండి.

సంక్రాంతి అంటే జ్ఞాపకంవచ్చింది. మీరు పంచాంగాలు ఎప్పుడైనాచూచారా? వాటిలో ఒకదేవత ఏదో ఒక జంతువుమీదఎక్కి వస్తూవుంటుంది. ఆ జంతువు ప్రతి ఏటా మారుతుంది. ఆ దేవత ఏవాహనంమీద ఎక్కితే, ఆజాతి జంతువులకుగాని, పశువులకుగాని హాని అని మన పెద్దవాళ్ళ నమ్మకం. అందుచేతనే "ఈయేడు సంకురమియ్య దేనిమీదుగా పోయాడురా" అన్న ప్రశ్నపుట్టి సామెతగా మారింది. మరి ఈయేడు సంకురమియ్య ఎవరిమీదుగా పోయాడు? పంచాంగం చూడకండి. హిట్లరు మీదుగాపొయ్యాడు. అందుకనే నాజీ రాక్షసులు చావు దెబ్బలు తింటున్నారు, నిజమేనా?

— దొడ్డమ్మ

మాతృభాషలోనే శిక్షణ ఇవ్వాలి

తమ్మారెడ్డి సత్యనారాయణ

(ఆంధ్రరాష్ట్రీ విద్యార్థిసంఘ కార్యదర్శి)

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎకాడిమిక్ కౌన్సిల్ సమావేశం డిశంబరు 10 వ తారీఖున గుంటూరులో సమావేశమయింది. ఈ సమావేశంలో డాక్టరు యం. వి. కృష్ణారావుగారు 1944 మార్చి నుంచి ఇటర్మీడియటు విద్యార్థులకు తెలుగులోనే శిక్షణ ఇవ్వాలని ఒక తీర్మానాన్ని ప్రతిపాదించారు. ఈ తీర్మానాన్ని ప్రొఫెసరు మామిడిపూడి వెంకటరంగయ్యగారు, డి. వి. రామస్వామిగారు బలపరచారు. తీర్మానం అంగీకరించబడింది. ఈతీర్మానాన్ని ఆంధ్ర విద్యార్థులందరు ఐక్యకంఠంతో ఆమోదించుతారు. ఆంధ్ర విద్యార్థులందరూ కోరే ఈవిషయాన్ని ప్రతిపాదించినందుకు డా. కృష్ణారావుగారిని ప్రతిఆంధ్రుడు అభినందించాలి. కాని కాంగ్రెసు యం.యల్.సి. గారైన ఆక్టింగు వైస్ ఛాన్సలర్ అక్కరాజు సుబ్బారావుగారు, ఇంకా మరికొందరు, ఈ విధానాన్ని సూత్రప్రాయంగానే అంగీకరించారు. సిండికేటు ఈవిషయాన్ని పర్యావలోకనచేసి విశ్వవిద్యాలయ కమిటీకి ఈ నిర్ణయాన్ని వదలవలెననే సవరణను వీరు ప్రతిపాదించారు. ఈవిధంగా వీరు ఈ విషయాన్ని వాయిదావేయడం శోచనీయం. ఈ అకాడమిక్కు కౌన్సిలులోని మరికొందరు తెలుగు భాషలో విద్యచెప్పడానికి చాలా ధనం ఖర్చు పెట్టవలసి యుంటుందని, చాలా అడ్డంకులు దాటాలని, ఇక్కడ విద్యార్థులను ఇతర యూనివర్సిటీలవారు చేర్చుకుంటారో లేదో అని, అనుమానాలు వెళ్లబుచ్చారు. మాతృభాషలోనే శిక్షణ ఇవ్వాలనే విధానం కొన్ని సంవత్సరాలనుంచి హైదరాబాదు ఉస్మానియా యూనివర్సిటీలో అమలులోనున్నది. అచట ఇంటర్మీడియటులో, వృక్షశాస్త్రము, జంతుశాస్త్రము, రసాయనశాస్త్రము, భౌతికశాస్త్రము చరిత్ర, మొదలగు గ్రూపు సబ్జెక్టులు ఉర్దూలోనే బోధిస్తున్నారు. ఇంజనీరింగు, 'లా', మెడికల్, మొదలగు టెక్నికల్ కోర్సులుకూడా ఉర్దూలోనేశిక్షణ ఇస్తున్నారు.

1944 నుంచి అన్నామలై యూనివర్సిటీలో గ్రూపుసబ్జెక్టులలో తమిళభాషలోనే శిక్షణ యివ్వడానికి నిర్ణయించుకున్నారు. కాన ఆంధ్ర యూనివర్సిటీవారు, ఉస్మానియా, అన్నామలై యూనివర్సిటీలను ఆదర్శంగా తీసుకుని, కృష్ణారావుగారి తీర్మానాన్ని ఆమోదించాలి.

ఈవిధానంయొక్క ఆవశ్యకత

ఇప్పటికి కొన్ని సంవత్సరాలనుంచి స్కూలుఫైనలు విద్యార్థులకు, చరిత్ర, సైన్సు, ిక్కలు, మొదలగు విషయాలలో తెలుగులోనే శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్మీడియటులో గ్రూపుసబ్జెక్టు ఇంగ్లీషులో చెప్పడంవల్ల వీరు అర్థంచేసుకోవడం, అర్థంచేసుకున్నదానిని పరీక్షలలో ఇంగ్లీషులో వ్రాయడం, కష్టమవుతుంది. ఏవిషయాన్నైనాగాని తెలుగులో చెపితే సులభంగా అర్థంచేసుకోగల్గుతారు. ఇంగ్లీషుభాషను అర్థంచేసుకోడానికి పడవలసిన అనవసర శ్రమ తప్పుతుంది. ఈ విధానం అమలుపర్చితే పరీక్షలలో ఉత్తీర్ణులయ్యేవారిసంఖ్య తప్పక హెచ్చుతుంది. ఇంతేగాక ఈవిధానం అమలు జరుపాలంటే భౌతిక శాస్త్రం, రసాయనశాస్త్రం, జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం, లెక్కలు, మొదలగు విషయాల మీద తెలుగులో పుస్తకాలు తీసుకురావాలి. దీనితో ఆంధ్రభాష ఈ వివిధవిషయాలలో అభివృద్ధి చెందుతుంది. ముందు ముందు ఇంగ్లీషుతెలియనివారికికూడా వివిధశాస్త్రములు అందుబాటులో వుంటాయి. కాన విద్యావిధానాన్ని, ఆంధ్రభాషను, ముందుకు తీసుకుని పోయే ఈ విధానాన్ని ఆంధ్రాభ్యుదయాన్ని కోరే ప్రతి ్క్తిబలపర్చాలి.

భాషాప్రయుక్త రాష్ట్రాలు ఏర్పరచాలనీ, మాతృభాషలోనే విద్యనేర్పాలనీ, ప్రభుత్వ కార్యక్రమమంతా జరగాలనీ, కాంగ్రెసు ఏనాడో ప్రకటించింది. ఏజాతిఅయినా అభివృద్ధి కావాలంటే, దాని మాతృభాషలో విద్య నేర్పబడాలి. ఆంధ్రులు ఎంతో కాలంనుంచి ప్రత్యేకరాష్ట్రంకోసం ఆందోళన చేస్తున్నారు. ప్రత్యేకరాష్ట్రం సాధించడానికి, తెలుగుభాషలో ఉన్నత విద్య నేర్పేటట్లు చేయడం ఒకమెట్టు. కనుక ప్రతిఆంధ్రుడూ పై తీర్మానాన్ని బలపరచాలి.

ముస్లిం విద్యార్థులు

ముస్లిం విద్యార్థి సోదరులుకూడా ఈ విధానం అంగీకరించాలి. కారణం ఏమంటే, వారిలో దాదాపు అందరూ స్కూలుఫైనలు వరకు అన్ని విషయాలలోను తెలుగులోనే శిక్షణపొందు తున్నారు. చిన్నప్పటినుంచి తెలుగులోనే శిక్షణపొందుతూ, తెలుగునే మాట్లాడుతూ, ఇంటర్మీడియటులో ఇంగ్లీషులో శిక్షణ నివ్వాలని ఏముస్లిం విద్యార్థికోరడు. అంతేగాకుండా, తెలుగు వ్రాయగల, మాట్లాడగల, ముస్లిం విద్యార్థి ఇంగ్లీషులోకంటే తెలుగులో బాగా అర్థంచేసుకోగల్గుతాడు. తెలుగురాని ముస్లింవిద్యార్థులుంటే వారి సౌకర్యార్థం ఆంధ్ర యూనివర్సిటీవారు యూనివర్సిటీ కాలేజీలోనే ఉర్దూ సెక్షన్ పెట్టాలని ఆందోళన చెయ్యాలి.

యస్. రాధాకృష్ణన్ ప్రశంస

డిశంబరు 12 వ తారీఖున హైదరాబాద్‌లో సమావేశమైన విశ్వవిద్యాలయ కమిటీ (Inter - University Board) కు అధ్యక్షత వహించుతూ ఈ విషయంపై రాధాకృష్ణన్‌గారు ఇలా అన్నారు: "ఉస్మానియా యూనివర్సిటీవారు, వైద్యం, ఇంజనీరింగు, ఇతర టెక్నికల్ విషయాలలో ఉర్దూలో శిక్షణ ఇవ్వడం దేశంలో ఇతర ప్రాంతాలవారికి ఆదర్శం. వారి అనుభవం ఇతర ప్రాంతాలవారికి చాలా బాగా తోడ్పడుతుంది"

1944 నుంచి తప్పక అమలు పర్చాలి

అన్నివిధాలా ఉపయోగకరమైన ఈ విధానాన్ని ఆంధ్ర యూనివర్సిటీ తప్పక అమలుపర్చాలి. ఆంధ్రయూనివర్సిటీ సిండికేటు 1944 మార్చిలో సమావేశం కాబోతున్నది. సిండికేటు ఈ విధానాన్ని అంగీకరించాలంటే ఆంధ్రవిద్యార్థులు ఈవిధానంయొక్క ఆవశ్యకతను ఐక్యకంఠంతో చాటాలి. ఆంధ్రజాతి అభ్యుదయాన్ని కోరే ప్రతివ్యక్తి, సంస్థ, పత్రిక, కూడా ఈ విధానం అమలుపర్చుటకు ఆందోళన చేయాలి.

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE